నేటి కందం- నేటికి అందం

పద్ధతులను పాటించి-వి
రుద్ధతులను తొలగజేయు రోచిర్మయులై
యుద్ధములను గోరుకొనని
బుద్ధుల కావాస మయ్యె భూటాను మొగిన్

(17-12-1907
భూటాన్ అవతరణ)

-రాధశ్రీ



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

తప్పులెత్తి చూపడంలో
తప్పులేదు ఎవరికైనా
తమతప్పులు సరిదిద్దుకు
తరలుతారా చివరికైనా
అధికార విపక్షాల్లో
అందరిలో ఒకే నీతి
అ-1బద్దాలు ఆడడంలో
అగ్రశ్రేణి వాళ్ల ఖ్యాతి

చురక

-వేల్పుల నారాయణ
9440433475



website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 17-12-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:105 పేజీలు:6 వెల: రూ.1/-


## లగచర్ల అంశంపై శాసనసభలో చర్చకు పట్టుబట్టిన బీఆర్ఎస్

### - సభ్యుల ఆందోళనతో శాసన సభ రేపటికి వాయిదా



హైదరాబాద్ డిసెంబర్ 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );లగచర్ల అంశంపై శాసనసభలో చర్చకు బీఆర్ఎస్ పట్టుబట్టింది. పర్యాటక శాఖపై కాకుండా లగచర్ల రైతుల బేడీల విషయంలో చర్చ చేపట్టాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. చర్చకు అనుమతించాలని ప్లకార్డులు పట్టుకుని నిరసనలు తెలిపారు. ఇదేమి రాజ్యం.. ఇదేమి రాజ్యం.. దోపిడీ రాజ్యం.. దొంగల రాజ్యం అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నినాదాలు చేశారు. విపక్ష సభ్యుల ఆందోళనతో శాసన సభను స్పీకర్ గడ్డం ప్రసాద్ రేపటికి వాయిదా వేశారు. లగచర్ల అంశంపై చర్చ చేపట్టాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసనలతో అసెంబ్లీ దద్దరిల్లింది. లగచర్ల రైతులకు బేడీలు వేయడంపై శాసనసభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆందోళన చేపట్టారు. రైతులకు బేడీలు వేసిన ఫొటోలతో కూడిన ప్లకార్డులతో నిరసనలు తెలిపారు. ఇదేమి రాజ్యం.. ఇదేమి రాజ్యం.. దోపిడీ రాజ్యం.. దొంగల రాజ్యం అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నినాదాలు చేశారు. రైతులకు బేడీలు వేస్తారా సిగ్గు సిగ్గు అంటూ విమర్శించారు. బీఆర్ఎస్ ఆందోళనతో శాసన లాబీలో భారీగా మార్షల్స్ మోహరించారు. శాసనభ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బలవంతంగా బయటకు పంపించేందుకు యత్నించారు. అయినప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వెనక్కి తగ్గలేదు. పర్యాటక శాఖపై కాకుండా లగచర్ల రైతుల బేడీల విషయంలో చర్చ చేపట్టాలని డిమాండ్ చేశారు. లగచర్ల అంశంపై ఎందుకు చర్చ చేపట్టడం లేదని ప్రశ్నించారు. లగచర్ల అంశంపై చర్చ చేపట్టేందుకు ప్రభుత్వం సుముఖంగా లేకపోవడంతో సభను రేపటికి వాయిదా వేశారు. దీంతో అసెంబ్లీ ప్రాంగణంలోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆందోళన చేపట్టారు. లగచర్ల రైతులకు బేడీల విషయంలో చర్చ చేపట్టాలని ఎమ్మెల్యేల ప్రవేశ ద్వారం దగ్గర ధర్నాకు దిగారు.

## సంక్రాంతి నుంచి కొత్త రేషన్ కార్డులు

హైదరాబాద్ డిసెంబర్ 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న వారికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. సోమవారం అసెంబ్లీలో మాట్లాడుతూ.. సంక్రాంతి నుంచి కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని ప్రకటించారు. రేషన్ కార్డుల జారీపై మంత్రివర్గ ఉప సంఘం వేశామని తెలిపారు. దాదాపు 36 లక్షల మందికి కొత్త రేషన్ కార్డులు ఇచ్చే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు ఆయన చెప్పారు. కొత్త రేషన్‌కార్డులకు దాదాపు రూ.956 కోట్ల వ్యయం అంచనా వేసినట్లు తెలిపారు. అలాగే.. ప్రస్తుతం రేషన్ కార్డుదారులకు ఇస్తున్న 6 కిలోలతో పాటు సన్నబియ్యం కూడా ఇస్తామని స్పష్టం చేశారు.

హైదరాబాద్ డిసెంబర్ 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న వారికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. సోమవారం అసెంబ్లీలో మాట్లాడుతూ.. సంక్రాంతి నుంచి కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని ప్రకటించారు. రేషన్ కార్డుల జారీపై మంత్రివర్గ ఉప సంఘం వేశామని తెలిపారు. దాదాపు 36 లక్షల మందికి కొత్త రేషన్ కార్డులు ఇచ్చే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు ఆయన చెప్పారు. కొత్త రేషన్‌కార్డులకు దాదాపు రూ.956 కోట్ల వ్యయం అంచనా వేసినట్లు తెలిపారు. అలాగే.. ప్రస్తుతం రేషన్ కార్డుదారులకు ఇస్తున్న 6 కిలోలతో పాటు సన్నబియ్యం కూడా ఇస్తామని స్పష్టం చేశారు.

## ఆ భూములు వెనక్కి తీసుకుంటాం- మంత్రి దుద్దిళ్ల

-పరిశ్రమలు ప్రారంభించని ల్యాండ్స్ పై బిజెపి సభ్యుడి ప్రశ్న
-పరిశ్రమల వ్యర్థాలతో మత్స్య సంపదకు ప్రమాదం
-కంపెనీలపై చర్యలకు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పట్టు
-ఆ పరిశ్రమల భూములు వెనక్కి తీసుకుంటామన్న మంత్రి దుద్దిళ్ల



హైదరాబాద్, డిసెంబర్ 16:పరిశ్రమల వ్యర్థాలతో చెరువుల్లోని చేపలు చనిపోతున్నాయని, ఆ పరిశ్రమలకు ఇచ్చిన భూములు ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉన్నాయో చెప్పాలని అసెంబ్లీలో ప్రశ్నించారు బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి. ప్రొడక్షన్ ప్రారంభించని పరిశ్రమల వివరాలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి శ్రీధర్ బాబు ఉత్పత్తి ప్రారంభించని పరిశ్రమల భూములు వెనక్కి తీసుకుంటామన్నారు . అలాగే భూములను మిస్ యూస్ చేస్తున్న పరిశ్రమలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పరిశ్రమలపై ఫిబ్రవరి వరకు కమిటీ నివేదిక ఇస్తుందన్నారు తెలంగాణలో35 ప్రాంతాల్లో కొత్త పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తామన్నారు మంత్రి శ్రీధర్ బాబు. పరిశ్రమల కాలుష్యాలపై చాలా ఫిర్యాదులు వచ్చాయన్నారు. కాలుష్య వ్యర్థాలను శుద్ధి చేయడం లేదని కమిటీ నివేదిక ఇచ్చిందన్నారు. పీసీబీ రూల్స్ ప్రకారం కాలుష్యంపై చర్యలు ఉంటాయన్నారు. పారిశ్రామిక పార్కుల కోసం మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు దుద్దిళ్ల.

### రెండు వర్సిటీలు.. క్రెడిట్ పాయింట్లలో తేడా ఎందుకు..

ప్రశ్నోత్తరాల సందర్భంగా ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన ఓవైసీ మాట్లాడుతూ, జేఎన్టీయూ, ఓయూ వర్సిటీల్లో క్రెడిట్ పాయింట్లలో తేడా ఎందుకని ప్రశ్నించారు. ఆ రెండు వర్సిటీల్లో సిలబస్ సేమ్ ఉన్నాయన్నారు. జేఎన్టీయూ, ఓయూల్లో క్రెడిట్ పాయింట్లలో ఏకరూపత తేవాలన్నారు. డిటేయిన్ అయిన స్టూడెంట్లు ఫీజు రీయింబర్స్ మెంట్ కు దూరమయ్యారని చెప్పారు. విద్యార్థులను డీటేయిన్ చేస్తే ఆరేళ్లలో ఇంజనీరింగ్ ఎలా పూర్తి చేస్తారని ప్రశ్నించారు అక్బరుద్దీన్ ప్రశ్నలకు సమాధానంగా త్వరలోనే క్రెడిట్స్,డిటెన్షన్ పై సమావేశం నిర్వహిస్తామన్నారు మంత్రి దామోదర రాజనర్సింహా. మేనేజ్ మెంట్స్ వర్సిటీ వీసీలతో స్పెషల్ మీటింగ్ నిర్వహిస్తామని చెప్పారు.

## డిసెంబరు 17న రాజస్థాన్‌లో ప్రధానమంత్రి పర్యటన

-'ఏక్ వర్ష్ ? పరిణామ్ ఉత్కర్ష్' కార్యక్రమంలో పాలుపంచుకోనున్న ప్రధానమంత్రి
--రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకొన్న సందర్భంగా ఈ కార్యక్రమ నిర్వహణ
-24 ప్రాజెక్టులకు ప్రధానమంత్రి ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు
-రూ. 46,300 కోట్లకు పైగా విలువైన ఇంధనం, రహదారులు, రైల్వేలు, నీటి ప్రాజెక్టులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 16:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ డిసెంబరు 17న రాజస్థాన్‌లో పర్యటించనున్నారు. రాజస్థాన్ ప్రభుత్వం ఒక సంవత్సర కాలాన్ని పూర్తి చేసుకొన్న సందర్భంగా ఏర్పాటు చేసిన ఏక్ వర్ష్ - పరిణామ్ ఉత్కర్ష్' కార్యక్రమంలో ప్రధాని పాల్గొంటారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో నిర్వహించే ఈ కార్యక్రమంలో ఇంధనం, రహదారులు, రైల్వేలు, నీటికి సంబంధించిన, రూ.46,300 కోట్లకు పైగా విలువైన 24 ప్రాజెక్టులకు ప్రధాని ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు.

ప్రధానమంత్రి రూ.11,000 కోట్లకన్నా ఎక్కువ విలువైన 9 ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. వీటిలో 7 కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులతోపాటు 2 రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్టులున్నాయి. ఆయన రూ.35,300 కోట్లకు పైగా విలువైన 15 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టులలో 9 ప్రాజెక్టులు కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు. ఇవి కాకుండా మరో 6 రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్టులు కూడా ఉన్నాయి.

ఈ కార్యక్రమం వేదికగా ప్రారంభించే ప్రాజెక్టుల్లో నవ్‌నేరా ఆనకట్ట, స్మార్ట్ ఎలక్ట్రిసిటీ ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ అండ్ అసెట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ప్రాజెక్టులు, భీల్‌డీ-సమ్‌దడీ-లూనీ--జోధ్‌పూర్ ? మెడ్‌తా రోడ్- ? దేగానా- రతన్‌గఢ్ సెక్షన్ రైలుమార్గ విద్యుదీకరణతోపాటు ఢిల్లీ- వడోదరా గ్రీన్ ఫీల్డ్ అలైన్‌మెంట్ కు చెందిన ప్యాకేజ్ 12 (ఎన్‌హెచ్-148ఎన్)భాగంగా ఉన్నాయి. మేజ్ నది పైన ప్రధాన వంతెన ప్రాజెక్టు సహా జంక్షన్ వరకు ఉన్న ప్రాజెక్టు (ఎస్‌హెచ్-37ఏ)లో మరో భాగం సైతం ప్రాజెక్టుల్లో భాగంగా ఉంది. ఈ ప్రాజెక్టులు ప్రజలకు సులభమైన రాకపోకలను అందుబాటులోకి తీసుకురావడంలో, ప్రధానమంత్రి సూచించిన హరిత ఇంధన సాధన ఆశయానికి అనుగుణంగా రాష్ట్ర ఇంధన అవసరాల్ని తీర్చడంలో సాయపడనున్నాయి.

ప్రధాని రాంగఢ్ బరాజ్, మహల్‌పూర్ బరాజ్ వ్యవస్థ నిర్మాణం కోసం రూ. 9,400 కోట్లకు పైగా ఖర్చుతో చంబల్ నదిపై నవ్‌నేరా ఆనకట్ట నుంచి బీసల్‌పూర్ ఆనకట్ట నిర్మాణ పనులకు, అలాగే ఈసర్‌దా ఆనకట్ట వరకు ఒక కాలవ ద్వారా నీటిని పంపేందుకు ఉద్దేశించిన ఒక వ్యవస్థ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు.

ప్రభుత్వ కార్యాలయాల భవనాలపైన సౌర ఇంధన ఫలకాల్ని ఏర్పాటుచేయడం, బికనేర్‌లోని పూగల్‌లో 2000 మెగావాట్ల సామర్థ్యంతో ఒక సోలార్ పార్క్‌ను, ఒక్కొక్కటి 1000 మెగావాట్ల సామర్థ్యంతో ఉండే రెండు దశల సోలార్ పార్కుల అభివృద్ధి పనులకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు.

ధోల్‌పూర్‌లోని సాయీపావ్ నుంచి భరత్‌పూర్-డీగ్-కుమ్హేర్-నగర్-కామాన్, పహాడీల వరకు తాగునీటి సరఫరా మార్గాన్ని నిర్మించడం, అలాగే చంబల్-ధోల్‌పూర్-భరత్‌పూర్ రెట్రోఫిట్టింగ్ పనులకు కూడా ప్రధాని శంకుస్థాపనలు చేయనున్నారు. లూనీ-సమ్‌దడీ- భీల్‌డీ డబల్ లైన్, అజ్మీర్ - చందేరియా డబల్ లైన్‌లతోపాటు జైపూర్- సవాయి మాధోపూర్ డబల్ లైన్ రైల్వే ప్రాజెక్టుల పనులకు, ఇంధన ప్రసారానికి సంబంధించిన ఇతర ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేస్తారు.

## అసెంబ్లీ నుంచి బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్

హైదరాబాద్, డిసెంబర్ 16:డిసెంబర్ 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. సోమవారం ఉదయం మళ్లీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు మాట్లాడుతూ.. సర్పంచుల పెండింగ్ బిల్లులపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రూ. 691 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని.. రాష్ట్రంలో బడా కాంట్రాక్టర్లకు మాత్రం బిల్లులు వస్తున్నాయి విమర్శించారు.ఏడాదిగా బిల్లులు చెల్లించకుండా సర్పంచులను గోస పెడుతున్నారని నిలదీశారు. గవర్నర్, మంత్రులను కలిసి సర్పంచులు మొరపెట్టుకున్నారని.. చలో అసెంబ్లీ చేపడితే నిరసనకారులను అరెస్టు చేశారని చెప్పారు. అయితే, సర్పంచుల పెండింగ్ బిల్లులపై ప్రభుత్వం సరైన సమాధానం ఇవ్వట్లేదని బిఆర్ఎస్ మెంబర్స్ నిరసన తెలుపుతూ..శాసనసభ నుంచి వాకౌట్ చేశారు.

## ఇంటర్ విద్యార్థులు బీ రెడీ !



హైదరాబాద్, డిసెంబర్ 16:తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ వచ్చేసింది. ఈ మేరకు తెలంగాణ స్టేట్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ 2025 షెడ్యూల్‌ను ప్రకటించింది.

షెడ్యూల్ ప్రకారం, ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు రెండు సెషన్లలో ప్రాక్టికల్ పరీక్షలు జరగనుండగా.. మార్చి 5 నుంచి 25 వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి.

పూర్తి షెడ్యల్ : ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష షెడ్యూల్..

5 మార్చి (బుధవారం): సెకండ్ లాంగ్వేజ్ పేపర్-ఎ
7 మార్చి (శుక్రవారం): ఇంగ్లీష్ పేపర్-ఎ
11 మార్చి(మంగళవారం): మ్యాథ్స్ పేపర్-ఎ ం, బోటనీ పేపర్-ఎ, పొలిటికల్ సైన్స్ పేపర్-ఎ
13 మార్చి (గురువారం): మ్యాథ్స్ పేపర్-ఎ ః, జువాలజీ పేపర్-ఎ, హిస్టరీ పేపర్-ఎ
17 మార్చి (సోమవారం): ఫిజిక్స్ పేపర్-ఎ, ఎకనామిక్స్ పేపర్-ఎ
19 మార్చి (బుధవారం): కెమిస్ట్రీ పేపర్-ఎ, కామర్స్ పేపర్-ఎ
21 మార్చి (శుక్రవారం): పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-ఎ, బ్రిడ్జ్ కోర్సు మ్యాథ్స్ పేపర్-ఎ (బై.పి.సి విద్యార్థులు)
24 మార్చి (సోమవారం): మోడరన్ లాంగ్వేజ్ పేపర్-ఎ, జాగ్రఫీ పేపర్-ఎ

ఇంటర్ రెండవ సంవత్సరం పరీక్ష షెడ్యూల్..

6 మార్చి (గురువారం): సెకండ్ లాంగ్వేజ్ పేపర్-ఎఎ
10 మార్చి (సోమవారం): ఇంగ్లీష్ పేపర్-ఎఎ
12 మార్చి (బుధవారం): మ్యాథ్స్ పేపర్-ఎఎ ం, బోటనీ పేపర్-ఎఎ, పొలిటికల్ సైన్స్ పేపర్-ఎఎ
15 మార్చి (శనివారం): మ్యాథ్స్ పేపర్-ఎఎ ః, జువాలజీ పేపర్-ఎఎ, హిస్టరీ పేపర్-ఎఎ
18 మార్చి (మంగళవారం): ఫిజిక్స్ పేపర్-ఎఎ, ఎకనామిక్స్ పేపర్-ఎఎ
20 మార్చి (గురువారం): కెమిస్ట్రీ పేపర్-ఎఎ, కామర్స్ పేపర్-ఎఎ
22 మార్చి (శనివారం): పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-ఎఎ, బ్రిడ్జ్ కోర్సు మ్యాథ్స్ పేపర్-ఎఎ (ఃతి.ఖ.అ విద్యార్థులు)
25 మార్చి (మంగళవారం): మోడరన్ లాంగ్వేజ్ పేపర్-ఎఎ, జాగ్రఫీ పేపర్-ఎఎ.

## జాకీర్ హుస్సేన్ ఓ మ్యూజిక్ జీనియస్: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 16: తబలా విద్వాంసుడు ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ మృతి పట్ల ప్రధాని మోదీసంతాపం తెలిపారు. భారత సంప్రదాయ సంగీతంలో విప్లవం తీసుకువచ్చిన ఓ జ్ఞానిగా ఉస్తాద్ జకీర్ హుస్సేన్‌ను గుర్తు చేసుకుంటామన్నారు. ప్రధాని మోదీ తన ట్విట్టర్‌లో స్పందిస్తూ.. లెజెండరీ మ్యాస్ట్రో జకీర్ హుస్సేన్ మృతి బాధకు గురి చేసిందన్నారు. తబలా వాయిద్యాన్ని విశ్వవ్యాప్తం చేసిన సంగీత కళాకారుడు అని పేర్కొన్నారు. తన తబలా మ్యూజిక్‌తో లక్షలాది మంది అభిమానుల్ని ఆకట్టుకున్నట్లు చెప్పారు. భారతీయ క్లాసికల్ సంప్రదాయాలను.. గ్లోబల్ మ్యూజిక్ తో సమ్మిళితం చేసి.. సాంస్కృతిక ఐకమత్యాన్ని ప్రదర్శించినట్లు తెలిపారు. జాకీర్ హుస్సేన్ ఇచ్చిన ప్రదర్శనలు.. రసభరితమైన బాణీలు.. రాబోయే తరాలకు చెందిన మ్యూజిక్ లవర్స్‌ను ప్రేరేపిస్తూనే ఉంటాయన్నారు. జాకీర్ కుటుంబసభ్యులు, స్నేహితులు, ప్రపంచ సంగీత లోకానికి సంతాపం చెబుతున్నట్లు మోదీ తన ట్వీట్‌లో వెల్లడించారు.

## జాబ్ క్యాలెండర్ జాప్యంపై అధ్యయనం

### - టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 15 : (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); టీజీపీఎస్సీ కేవలం సిలబస్ మాత్రమే ఇస్తుందని, ఏ పుస్తకం చదవాలన్నది అభ్యర్థుల ఇష్టమని టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం స్పష్టంచేశారు. ఏ పుస్తకం ప్రామాణికమో చెప్పకూడదని తెలిపారు. జాబ్ క్యాలెండర్ జాప్యంకావడంపై అధ్యయనం చేస్తామని, ఈ అంశంపై స్పష్టత తీసుకుంటామని తెలిపారు. జాబ్ క్యాలెండర్‌లో ఏమున్నాయో చూసి, రిజర్వేషన్ల వల్ల ఆగిందా..? లేక మరేవైన కారణాలున్నాయా..? అన్నది స్టడీ చేస్తామని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ కారణంగా జాబ్ క్యాలెండర్‌ను ప్రభుత్వం అమలు చేయడంలేదన్న వార్తలొచ్చాయి. దీంతోనే గత అక్టోబర్‌లో గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదలకాలేదు. జాబ్ క్యాలెండర్ ఎందుకు అమలు చేయడం లేదని విలేకరులు అడిగిన ప్రశ్నకు బుర్రా వెంకటేశం పై విధంగా స్పందించారు. 18, 19న ఢిల్లీకి వెళ్లి యూపీఎస్సీ, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలతో భేటీ కానున్నట్లు పేర్కొన్నారు. జనవరిలో రాష్ట్రప్రభుత్వంతో భేటీ అయ్యి నివేదికను అందజేస్తామని వెల్లడించారు. ఆ తర్వాత సంస్థాగత మార్పులు చేసి యూపీఎస్సీతో పోటీ పడేలా కమిషన్‌ను సిద్ధంచేస్తామని తెలిపారు.

## హైదరాబాద్ కాంగ్రెస్ సమీక్ష రసాభాస. మంత్రి పదవి కోసం అంజన్ కుమార్ పట్టు..!

హైదరాబాద్, డిసెంబర్ 16: గాంధీభవన్‌లో సోమవారం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఏఐసీసీ తెలంగాణ ఇన్ చార్జ్ దీపాదాస్ మున్షీ నిర్వహించిన సమీక్షా సమావేశం రసాభాసగా ముగిసింది. సికింద్రాబాద్ మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ వ్యాఖ్యతో దీపాదాస్ మున్షీ సమావేశం నుంచి అర్ధంతరంగా వెళ్లిపోయారు. తన కొడుకు అనిల్ కుమార్ యాదవ్‌కు రాజ్యసభ ఇచ్చినంత మాత్రాన తమ కుటుంబానికి మరో పదవికి ఇవ్వకూడదా.. అని అంజన్ కుమార్ యాదవ్ నిలదీశారు. తనకు రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రి పదవి ఎందుకు ఇవ్వకూడదని ప్రశ్నించారు. 2004, 2009 సార్వత్రిక ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి పార్లమెంటుకు ఎన్నికైన అంజన్ కుమార్ యాదవ్ 2014, 2019 లోక్ సభ ఎన్నికల్లోనూ, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ముషీరాబాద్ స్థానం నుంచి ఓటమి పాలయ్యారు. ఇదిలా ఉంటే అంతకు ముందు దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ కార్యకర్తలంతా కలిసికట్టుగా పని చేస్తేనే గ్రేటర్ హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.

## నేడు లోక్‌సభ ముందుకు వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లు..!

న్యూఢిల్లీ, డిసెంబర్ 16:దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణకు సంబంధించి రూపొందించిన రెండు కీలక బిల్లులకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే.

ఈ నేపథ్యంలో ఒకే దేశం-ఒకే ఎన్నిక లక్ష్యంతో దేశమంతా ఒకేసారి నిర్వహించే జమిలి ఎన్నికలపై లోక్‌సభలో బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమైనట్లు తెలిసింది. రేపు లోక్‌సభలో ఈ బిల్లులను ప్రవేశ పెట్టనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తాజాగా వెల్లడించాయి. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ 129వ రాజ్యాంగ సవరణ బిల్లు కింద జమిలి బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు తెలిపాయి. ఆ తర్వాత దీనిని చర్చ కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపనున్నారు.

వాస్తవానికి రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు, కేంద్ర పాలిత ప్రాంత చట్టాలు (సవరణ బిల్లు)ను సోమవారం సభలో ప్రవేశ పెట్టనున్నట్లు ముందుగా వార్తలు వచ్చాయి. అయితే తాజాగా రివైజ్ చేసిన లోక్‌సభ బిజినెస్ జాబితాలో వీటిని తొలగించారు.

లోక్‌సభ కార్యదర్శి విడుదల చేసిన రివైజ్డ్ జాబితాలో సోమవారం ఈ రెండు బిల్లులకు సంబంధించిన అజెండాను పెట్టలేదు. దీంతో ఈ బిల్లులు నేడు సభ ముందుకు రాలేదు. మంగళవారం ఈ బిల్లులు లోక్షభ ముందుకు రానున్నట్లు ప్రభుత్వ వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంది.

దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభకు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలను నిర్వహించడమే జమిలి ఎన్నికల ప్రధాన ఉద్దేశం. వాస్తవానికి మన దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణ కొత్తదేమీ కాదు.

1952లో తొలి సాధారణ ఎన్నికలు మొదలుకొని, 1967 వరకు లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు చాలావరకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి.

అయితే అనంతర కాలంలో సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడకపోవడం, గడువుకు ముందే పలు రాష్ట్రాల శాసనసభలను బర్తరఫ్ చేయడం తదితర కారణాలతో జమిలి ఎన్నికలు పట్టాలు తప్పాయి. దీంతో లోక్‌సభ, అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు జరపడం మొదలైంది.

## రాష్ట్రంలో 9 మంది అదనపు డీసీపీలకు పదోన్నతి.. ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, డిసెంబర్ 16: రాష్ట్రంలో 9 మంది అడిషనల్ డీసీపీలకు రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. అలాగే ముగ్గురు డీసీపీలను బదిలీ చేసింది. ఈ మేరకు పదోన్నతులు కల్పిస్తూ హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవి గుప్తా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.రాచకొండ డీసీపీ (స్పెషల్ బ్రాంచ్) పి.కరుణాకర్‌ను డీజీపీ కార్యాలయానికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఆయన స్థానంలో సైబరాబాద్ అదనపు డీసీపీ(క్రైమ్స్-ఎ)కు పదోన్నతి కల్పించారు. రాచకొండ డీసీపీ(ట్రాఫిక్) కె.మనోహర్‌ను రాచకొండ డీసీపీ (రోడ్ సేఫ్టీ)కి బదిలీ చేశారు. మాదాపూర్ డీసీపీ(ఎస్‌వోటీ) డి.శ్రీనివాస్‌ను మేడ్చల్ జోన్ డీసీపీ(ఎస్‌వోటీ)గా బదిలీ చేశారు.

### పదోన్నతి పొందిన అదనపు డీసీపీలు వీళ్లే..

కె.గుణశేఖర్ - మేడ్చల్ డీసీపీ (ట్రాఫిక్)
జి.నరసింహారెడ్డి - రాచకొండ డీసీపీ ( స్పెషల్ బ్రాంచ్)
ఎస్.మల్లారెడ్డి - రాచకొండ డీసీపీ (ట్రాఫిక్)
మద్దిపాటి శ్రీనివాస రావు - సీఐడీ ఎస్పీ
పి.శోభన్ కుమార్ - మాదాపూర్ డీసీపీ(ఎస్‌వోటీ)
టి. సాయి మనోహర్- మాదాపూర్ డీసీపీ (ట్రాఫిక్)
డి.రమేశ్ - ఎస్పీ (ఇంటెలిజెన్స్)
జే.చెన్నయ్య - ఐసీసీసీ హైదరాబాద్ ఎస్పీ
పి.విజయ్‌కుమార్- సీఐడీ ఎస్పీ
కె.మనోహర్ - రాచకొండ డీసీపీ (రోడ్ సేఫ్టీ)
డి.శ్రీనివాస్ - మేడ్చల్ డీసీపీ (ఎస్‌వోటీ)
పి.కరుణాకర్ -(డీజీపీకి రిపోర్ట్)

# వలసల వరదలు - ఒడువని దుఃఖాలు

## (18 డిసెంబర్ "అంతర్జాతీయ వలసదారులు దినం" సంబర్భంగా)

మానవ వలసలు ఒక ప్రమాదకర అంతర్జాతీయ సమస్యగా రోజు రోజుకు ప్రపంచ మానవాళిని వేధిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా 2014 నుంచి నేటి వరకు కనీసం 70,000 మంది వలసదారులు తమ ప్రాణాలను కోల్పోయారని లేదా ఆచూకీ తెలియకుండా పోయిందని, వాస్తవానికి ఈ సంఖ్య అనేక రెట్లు అధికంగా ఉండవచ్చని అధ్యయనాలు స్పష్టంగా చేస్తున్నాయి. ఒక్కొక్క వలసదారుల మరణాలు ఒక్కో కుటుంబానికి తీరని వ్యథను మిగిల్చిందని గమనించాలి. నేడు ప్రపంచవ్యాప్తంగా పలు కారణాలతో మానవ వలసలు క్రమంగా పెరగడం రానున్న కాలంలో ఒక భయానక మానవీయ సంక్షోభంగా మారనుందని స్పష్టం చేస్తున్నారు. దేశాల మధ్య యుద్ధాలు, అంతర్గత ఘర్షనలు, విపత్తులు, వాతావరణ ప్రతికూల మార్పులు, నిరంకుశ పాలనలు, ఆహార అభద్రత, మానవీయ సంక్షోభాలు, ఆర్థిక అసమానతలు లాంటి పలు కారణాలు వలసదారుల సంక్షోభానికి ఆజ్యం పోస్తున్నాయి.

కన్నీటి తుఫానులు ప్రవహించడం చూసాం. ఇజ్రాయిల్ - పాలస్తీనా, ఉక్రెయిన్ - రష్యా యుద్ధాలు, బంగ్లాదేశ్‌లో అంతర్గత రాజకీయ సంక్షోభం, ప్రకృతి విపత్తులు, ఆకలి కేకలు లాంటి కారణాలతో మానవ వలసల వరదలు పారడం, ఇరుగు పొరుగు దేశాల్లోకి లేదా సురక్షిత ప్రాంతాల్లోకి శరణార్థులుగా చేరడం, యుద్ధాలు లేదా అల్లరులతో ప్రాణాలు అరచేతుల్లా పెట్టుకొని ఇండ్లు వదిలి వలసదారులు పట్టడం చూసాం. వలసదారుల శ్రమ శక్తి, నైపుణ్య లక్షణాలు, ఆవిష్కరణ ఆలోచనలు,, ఔత్సాహిక ప్రవృత్తులు నేటి సమాజానికి ఎంతో ఉపకరిస్తాయని మరువరాదు. వలసదారులతో ఆయా ప్రాంతాల్లో ఆర్థిక ప్రగతి కనిపిస్తుందని, వారికి అవకాశాలు కల్పిస్తే సమాజాభివృద్ధికి కూడా ఎంతగానో దోహదపడతారని తెలుసు కోవాలి.

మిలియన్ల కొద్ది వలసదారుల తమ గృహాలను వదిలి ప్రాణాలు కాపాడుకోవడానికి పిల్లలతో సహా సురక్షిత ప్రాంతాలను వెతుక్కుంటూ ఇతర దేశాలు లేదా ప్రాంతాలకు పరుగులు తీయడాన్ని ఒక అమానవీయ చర్యగా భావించిన ఐరాస సభ్య దేశాలు 2000 నుంచి ప్రతి ఏట 18 డిసెంబర్ రోజుల " అంతర్జాతీయ వలసదారుల దినం లేదా ఇంటర్నేషనల్ మైగ్రంట్స్ డే" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. వలసదారుల పట్ల మానవ హక్కుల ఉల్లంఘనలకు సమాధానాలు, వారి దయనీయ పేదరికాలు, సమ్మిళిత అభివృద్ధి ఆశయాలు, వలసదారుల పరిరక్షణ పాలసీలు, వారి భద్రత, వారి శాంతి సురక్షలు, మానవీయ హక్కుల కల్పనలు, ఆకలి చావులను అడ్డుకోవడం, గౌరవంగా జీవించే హక్కులను కల్పించడం, స్వేచ్ఛను కలిపించడం, వివక్ష కోరల్లో చిక్కడం, హింసల పాలు కావడం, క్రూర మానవ అక్రమ రవాణా వలలో చిక్కడం, వారి అభిప్రాయాలు/కన్నీళ్లకు విలువ లేక పోవడం లాంటివి పలు అంశాలను చర్చించి సరైన సమాధానాలు వెతకడానికి ఈ వేదికలు ఉపకరిస్తున్నాయి. అంతర్జాతీయ వలసదారుల దినం-2024 థీమ్‌గా "వలసదారుల సకారాత్మక పాత్రను, వారి హక్కులను కాపాడుదాం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది. వలసదారుల కుటుంబాలను కాపాడడం, వారి సురక్షకు గొడుగులు పట్టడం మనందరి కనీస ధర్మం అని తెలుసుకోవాలి. వలసదారుల శ్రమ దోపిడీ ఒక ప్రధాన సమస్యగా మారడం విచారకరం.

### భారత్‌లో అంతర్గత వలసలు:

తెలుగు రాష్ట్రాల్లో నిర్మాణ రంగం, వ్యవసాయరంగాలు, వ్యాపారాలు, నైపుణ్య రంగాల్లో బీహార్, యూపీ, రాజస్థాన్ లాంటి రాష్ట్రాలకు చెందిన ప్రజలు వలసలు రావడం చూస్తున్నాం. నిస్సహాయ పరిస్థితుల్లో కుటుంబాలు లేదా వ్యక్తులు పలు కారణాలతో తమ గృహాలను వదిలి ఇతర దేశాలకు లేదా ప్రాంతాలకు వెళ్లడాన్ని మానవ వలసలుగా పిలుస్తారు. భారత్ లాంటి దేశాల్లో పని, ఆహార భద్రత, పేదరికం లాంటి కారణాలతో పట్టణాలు లేదా ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లడం చూస్తున్నాం. బలవంతంగా అయినా లేదా మరో దారి లేనపుడు వలసలు పెరుగుతున్నాయి. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, పర్యావరణ కారణాలతో భారతదేశంలో వలసలు కనిపిస్తున్నాయి. 2011 వివరాల ప్రకారం భారతదేశవ్యాప్తంగా 45.6 కోట్ల ప్రజలు ఇతర రాష్ట్రాలు లేదా ప్రాంతాలకు వలసలు వెళ్లారని, వీరిలో 54 శాతం మంది పట్టణాలకు వలసలు వెళ్లినట్లు తెలుస్తున్నది. యూపీ, బీహార్ లాంటి రాష్ట్రాల నుంచి దాదాపు 88 శాతం ఇతర రాష్ట్రాలకు వలసల వరదలు పారడం చూస్తున్నాం.

వలసదారుల సమస్య ఫలితంగా పౌర సమాజంపై సానుకూల, ప్రతికూల ఫలితాలు కనిపిస్తున్నాయి. ఆర్థిక, జనాభాపరమైన, సామాజిక, పర్యావరణ కోణాల్లో పలు సమస్యలు లేదా అనుకూల ఫలితాలు గమనించవచ్చు. మానవ హక్కులను కోల్పోవడం, సామాజిక అభద్రత, కనీస అవసరాల కొరత, గౌరవమైనా పని దొరక్కపోవడం, వైద్య ఆరోగ్య అభద్రత, కనీస వేతనాలు దొరక్కపోవడం, మురికి కూపాల్లో జీవనాలు లాంటి పలు సమస్యలు వలసదారులు వేధిస్తున్నాయి. వలసదారులు మనలాంటి సాధారణ మానవులే అని, వారికి కూడా గౌరవంగా జీవించే హక్కు ఉంటుందని తెలుసుకొని వారిని నవ సమాజంలో భాగంగా చూసుకుందాం, మానవీయ విలువలను కాపాడుదాం.

– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# గ్రూప్ 2 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, డిసెంబర్ 16: (నేటినిజం ప్రతినిధి):సోమవారం మెదక్ జిల్లా కేంద్రంలోని మాంటిసోరి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న గ్రూప్ 2 పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 16 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టిజిపిఎస్సి నిబంధనలు మేరకు పరీక్షా కేంద్రాలలోకి సెల్ ఫోన్ అనుమతి లేనికారణంగా నిబంధనలు పాటిస్తూ, కలెక్టర్ పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్లు తీసుకురావద్దన్న నియమాన్ని ఆయన పాటించారు. తన సెల్ ఫోన్‌ను వాహనంలోనే వదిలి వెళ్లి పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పర్యవేక్షణ, సౌకర్యాలను పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని ఇన్విజిలేటర్స్, చీఫ్ సూపరింటెండెట్లుకు సూచించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో పరీక్ష సజావుగా, సక్రమంగా జరిగేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేశామని తెలిపారు. పరీక్ష పూర్తి అయ్యే వరకు అభ్యర్థులను బయటికి పంపొద్దని ఆదేశించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా నిరాటంకంగా సరఫరా చేస్తున్నామని తెలిపారు. అత్యవసర వైద్య సేవలకు అన్ని కేంద్రాల్లో అత్యవసర వైద్య సేవల కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రూప్ 2 పరీక్ష పరీక్షకు జిల్లాలో మొత్తం 5,855 మంది అభ్యర్థులకు గాను, రెండో రోజు ఉదయం సెషన్ లో 2,815 మంది హాజరు కాగా, 3040 మంది గైర్హాజరు అయ్యారని 5,855.అభ్యర్థులకు గాను, మధ్యాహ్నం సెషన్ లో 2,809 పరీక్ష రాయిగా, 3046 మంది గైర్హాజరు అయ్యారని వివరించారు. జిల్లాలో గ్రూప్-2 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెల్లడించారు. కలెక్టర్ వెంట మెదక్ తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, ఎగ్జామినేషన్ సెంటర్ ఇంచార్జ్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లైంగిక కోరిక తీర్చలేదన్న ఆగ్రహంతో మహిళ హత్య

## -తల నరకడంతోపాటు మృతదేహాన్ని మూడు ముక్కలుగా కోశాడు




కోల్‌కతా డిసెంబర్ 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: లైంగిక కోరిక తీర్చలేదన్న ఆగ్రహంతో ఒక వ్యక్తి మహిళను హత్య చేశాడు. ఆమె తల నరకడంతోపాటు మృతదేహాన్ని మూడు ముక్కలుగా కోశాడు.

శరీర భాగాలను పలుచోట్ల పడేశాడు. తెగిన తలను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో దర్యాప్తు చేసి చివరకు ఆ వ్యక్తిని అరెస్ట్ చేశారు. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఈ సంఘటన జరిగింది.

రీజెంట్ పార్క్ ప్రాంతంలో తెగిన మహిళ తల పాలిథిన్ బ్యాగ్‌లో ఉండటాన్ని స్థానికులు గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. అలాగే శనివారం చెరువు సమీపంలో మహిళ మొండెం, దిగువ భాగాన్ని పోలీసులు కనుగొన్నారు.కాగా, ఆ ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలించారు. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్న 35 ఏళ్ల అతిఉర్ రెహమాన్ లస్కర్ నిందితుడిగా గుర్తించారు. సొంతూరుకు పారిపోయిన అతడ్ని అరెస్ట్ చేశారు. లస్కర్‌ను ప్రశ్నించగా లైంగిక కోరిక తీర్చనందుకు ఆ మహిళను హత్య చేసినట్లు పోలీసులకు చెప్పాడు.


పలమనేరు రచయితల సంఘం, చిత్తూరు జిల్లా
PERSPECTIVES
ఆహ్వానం
మిత్రులారా పర్ స్పెక్టివ్స్ ప్రచురించిన పలమనేరు బాలాజీ ఎరుకల జీవన గాథలు, తెలుగు సాహిత్యంలో మొదటి ఎరుకల కథా సంపుటి ఏకలవ్య కాలనీ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా మిమ్మల్ని సాదరంగా ఆహ్వానిస్తున్నాం.
ఆవిష్కర్తలు
రాగాల వెంకట రాహుల్,
వెయిట్ లిఫ్టింగ్ లో కామన్వెల్త్ క్రీడల్లో భారతదేశానికి స్వర్ణ పతకాలను అందించిన యువ క్రీడాకారుడు.
ఎన్. వేణుగోపాల్
కవి, రచయిత, సాహిత్య విమర్శకుడు, అనువాదకుడు, వీక్షణం పత్రికా సంపాదకుడు
సభ నిర్వహణ
ఎ.కె. ప్రభాకర్
పర్ స్పెక్టివ్స్ టీం తరపున, సంపాదకుడు, సాహిత్య విమర్శకుడు
యువ క్రీడాకారుడు రాహుల్ తొలిప్రతిని కవి కె. శివారెడ్డి గారికి అందజేస్తారు
వేదిక
స్కై బాబా గారి సాథి బుక్ స్టాల్
9B, B బ్లాక్, 9th ఫ్లోర్, సామ్రాట్ కాంప్లెక్స్, AG ఆఫీసు ఎదురుగా
ఇక్బాల్ మినార్ సర్కిల్ పక్కన,సైఫాబాద్ , హైదరాబాద్.
ఆవిష్కరణ
17.12.2024 మంగళవారం, సాయంత్రం నాలుగు గంటలకు.



ఈ సభలో పాల్గొంటున్న ఆత్మీయ అతిధులు
శ్రీయుతులు ఆర్.కె., కె. శివారెడ్డి, వాడ్రేవు చిన వీరభద్రుడు, యాకూబ్, శిలాలోలిత, యింద్రవెల్లి రమేష్, సుంకోజి దేవేంద్రాచారి, విమల, మెర్సీ మార్గరెట్, స్కై బాబా, గీతాంజలి, తాయమ్మ కరుణ, కృపాకర్ మాదిగ, జూపాక సుభద్ర, శివరాత్రి సుధాకర్, గుడిపాటి, ఎం.వి. రామిరెడ్డి, ఛాయ మోహన్, కె. ఎ. ముని సురేష్ పిళ్లై , జి.ఉమామహేశ్వర్, వంగాల సంపత్ రెడ్డి తదితరులు.
మీ రాకకై ఎదురు చూస్తూ..
పలమనేరు రచయితల సంఘం, చిత్తూరు జిల్లా.
వివరాలకు: 9440995010, 9885420027


# కాంగ్రెస్ పాలనలో తెలంగాణ తల్లిని, బతుకమ్మను దూరం చేస్తున్నారు

## -మండిపడ్డ ఎమ్మెల్సీ కవిత

జగిత్యాల డిసెంబర్ 16(ఎక్స్ ప్రెస్ న్యూస్ );జగిత్యాలలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పర్యటిస్తున్నారు. ధరూర్ బైపాస్ వద్ద ఎమ్మెల్సీ కవితకు గజమాలలతో ఘన స్వాగతం పలికారు. పెద్దసంఖ్యలో మహిళలు, కార్యకర్తలు తరలివచ్చారు. బైపాస్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి కవిత బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. జగిత్యాల అంటేనే బీఆర్ఎస్ అడ్డా అని మీ అందర్నీ చూస్తే తెలిసిపోతుందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ తల్లిని, బతుకమ్మను దూరం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహంలో బతుకమ్మ లేకపోవడంపై మహిళలు మండిపడుతున్నారని తెలిపారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళలకు రూ. 2500 ఇస్తామన్న హామీ ఏమైందని రేవంత్ సర్కార్‌ను నిలదీశారు.

# విద్యా వైద్యం ఆరోగ్య రంగాలతో పాటు మహిళా సాధికారద లక్ష్యంగా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత కల్పిస్తుంది

మెదక్, డిసెంబర్ 16: (నేటినిజం ప్రతినిధి):విద్యా వైద్యం ఆరోగ్య రంగాలతో పాటు మహిళా సాధికారద లక్ష్యంగా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత కల్పిస్తుందని మెదక్ నియోజకవర్గ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు .వైద్య విద్యార్థులందరూ డాక్టర్ కావాలన్నా కలను సహకారం చేయడంలో ఎంతోమంది కఠొరాశ్రమ దాగి ఉంది శాసనసభ్యులు మైనంపల్లిమెదక్ వైద్య కళాశాలలో ప్రత్యక్ష తరగతులు ఇందిరా మహిళా క్యాంటీన్ ప్రారంభించిన శాసనసభ్యులు మైనంపల్లి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌సోమవారం మెదక్ పిల్లికొట్టాల్ నందు వైద్య కళాశాలలో ప్రత్యక్ష తరగతులు, మహిళా క్యాంటీన్ ప్రారంభోత్సవంలో మెదక్ నియోజకవర్గం శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు పాల్గొన్నారు ముందుగా ప్రత్యక్ష తరగతులు, ఇందిరా మహిళ క్యాంటీన్ ను ప్రారంభించారు.

ఈ సందర్భంగా మెదక్ నియోజకవర్గ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ గత పాలకులు మెదక్ నియోజకవర్గ అభివృద్ధికి కొబ్బరికాయలతోనే కాలాన్ని గడిపారని కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడిన సంవత్సర కాలంలోనే మెదక్ నియోజకవర్గ అభివృద్ధిలో అగ్రగామిగాతీర్చిదిద్దుతున్నామన్నారు. వైద్య కళాశాల ప్రత్యక్ష తరగతులు ప్రారంభించుకోవడంతో పాటు మహిళా క్యాంటీన్ ఏర్పాటు చేయడం జరిగిందని మహిళలు ఆర్థిక చేయూత లక్ష్యంగా ముందుకు పోతున్నామన్నారు ఒకటి విద్య రెండవది వైద్యం మూడోది మహిళా సాధికారితకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఆరోగ్యంగా మంచిగుంటేనే ఏ పని అయినా చేయవచ్చని అన్నారు. మెదక్ నియోజక వర్గాన్ని దశల వారీగా అభివృద్ధి పర్చడమే లక్ష్యంగా ముందుకు పోతున్నామన్నారు.వైద్య కళాశాలలో ఈరోజు నుంచి ప్రత్యక్ష తరగతులు ప్రారంభించుకోవడం నైపుణ్యం గల అధ్యాపకులతో బోధన చేస్తున్నామన్నారు మెదక్ జిల్లాకు మెడికల్ కళాశాలకు రావడానికి మెదక్ నియోజకవర్గ శాసనసభ్యుడిగా తాను మరియు వైద్య ఆరోగ్యశాఖ మాత్యులు శ్రీ దామోదర్ రాజనర్సింహ గారు చాలా బాధ్యతగా కృషి చేశామని తెలిపారు. వైద్య విద్యార్థులు డాక్టర్ కావాలన్నా కలను సహకారం చేయడంలో దీని వెనుక ఎంతోమంది కఠోర శ్రమ దాగి ఉందన్నారు. ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తూ ప్రతి నిరుపేదకు ఉచిత వైద్యం అందించాలి ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించాలనే లక్ష్యంతో జిల్లాలో వైద్య కళాశాల తో పాటు, నర్సింగ్ కళాశాల ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. వైద్య విద్యార్థులు ఏమైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురావాలని పరిష్కారాన్ని కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారుఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, కళాశాల ప్రిన్సిపల్ రవీందర్, ఏరియా ఆసుపత్రి సూపరింటెంట్ శివదయాల్, సంబంధిత ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఒకే దేశం-ఒకే ఎన్నిక బిల్లుపై పునరాలోచనలో కేంద్ర ప్రభుత్వం!

న్యూ డిల్లీ డిసెంబర్ 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఒకే దేశం-ఒకే ఎన్నికకు సంబంధించిన బిల్లుపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచనలో పడినట్లు తెలుస్తున్నది. వాస్తవానికి, సోమవారం పార్లమెంట్‌లో బిల్లులు ప్రవేశపెట్టనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఈ క్రమంలో రాజ్యాంగం (129వ సవరణ) బిల్లు, కేంద్ర పాలిత ప్రాంత చట్టాల (సవరణ) బిల్లులను సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టేందుకు జాబితా చేసింది. తాజాగా సవరించిన లోక్‌సభ బిజినెస్ జాబితాలో సోమవారం నాటి ఎజెండాలో ఈ రెండు బిల్లులను తొలగించింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 20న ముగియనున్నారు. గురువారం కేబినెట్ రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు- 2024, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాలు (సవరణ బిల్లు), 2024కి ఆమోద ముద్ర వేసింది.ఆ తర్వాత శుక్రవారం సాయంత్రం బిల్లులకు సంబంధించిన ప్రతులను సభ్యులకు పంపిణీ పూర్తయ్యింది. ఈ క్రమంలో కేంద్రం బిల్లులను ప్రవేశపెడుతుందా? లేదా? అన్నది చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి జమిలీ ఎన్నికల కోసం రాజ్యాంగంలో కొత్తగా 82ఎ అధికరణను చేర్చాల్సి రానున్నది. పార్లమెంట్ పదవీకాలంలో మార్పు కోసం 83 అధికరణ, అసెంబ్లీ పదవీకాలం సవరణ కోసం 327 అధికరణను సవరించాల్సి ఉంటుంది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని అత్యున్నత స్థాయి కమిటీ సిఫారసుల మేరకు రాజ్యాంగ (129వ సవరణ) బిల్లును కేంద్రం రూపొందించిన విషయం తెలిసిందే. ముసాయిదా బిల్లుల ప్రకారం సార్వత్రిక ఎన్నికల తర్వాత లోక్‌సభ మొదటి సమావేశానికి రాష్ట్రపతి నోటిఫై చేసిన తేదీ నుంచి ఏకకాల ఎన్నికలు అమలులోకి వస్తాయి.రాజ్యాంగ సవరణ బిల్లు ప్రకారం.. ఈ నియమిత తేదీ తర్వాత ఎన్నికైన అన్ని రాష్ట్రాల అసెంబ్లీల పదవీ కాలాలు, లోక్‌సభ పూర్తికాల వ్యవధితో పాటు ముగిసేలా తగ్గిస్తారు. తద్వారా ఏకకాల ఎన్నికలకు మార్గం సుగమమవుతుంది. 2024 లోక్‌సభకు సంబంధించి మొదటి సమావేశం ముగిసిందున.. తదుపరి లోక్‌సభ ఎన్నికలు 2029లో జరుగుతాయి. ఆ లోక్‌సభ తొలి సమావేశంలో రాష్ట్రపతి నోటిఫై చేస్తే.. ఆ లోక్‌సభ పూర్తి పదవీ కాలం ఉంటే 2034లో తొలి విడత జమిలీ ఎన్నికలు జరుగుతాయి. బిల్లు ప్రకారం అసెంబ్లీలకు ఉన్న నిబంధనలు కేంద్ర పాలిత ప్రాంతాలైన ఢిల్లీ, జమ్మూ కశ్మీర్, పుదుచ్చేరికి వర్తిస్తాయి. కొత్త జమిలి ఎన్నికల బిల్లు ప్రకారం నిర్దేశిత కాల పరిమితి కన్నా ముందే పార్లమెంట్, రాష్ట్ర, యూటీల అసెంబ్లీలు రద్దయితే, ఆయా అసెంబ్లీలకు, పార్లమెంట్‌కు మిగిలి ఉన్న కాలానికి మాత్రమే మధ్యంతర ఎన్నికలు జరుగుతాయి.

# ఆయన కేవలం సినిమా రూపకర్తే కాదు...సాంస్కృతిక రాయబారి కూడా: పీఎం

న్యూఢిల్లీ, డిసెంబర్ 16:దిగ్గజ నటుడు శ్రీ రాజ్ కపూర్ శతజయంతి సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు నివాళులు అర్పించారు. ఆయన దూరదృష్టి గల సినీ రూపకర్త, నటుడు, వెండితెర సార్వభౌముడనీ ప్రధాని కొనియాడారు. శ్రీ రాజ్ కపూర్ చిత్ర దర్శకుడు మాత్రమే కాదని భారతీయ సినిమాను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన సాంస్కృతిక రాయబారిగా వర్ణిస్తూ, అనేక తరాలపాటు సినిమా దర్శకులు, నటులు ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకోవచ్చని శ్రీ మోదీ అన్నారు.

"ఈ రోజు దిగ్గజ నటుడు, దర్శకుడు రాజ్ కపూర్ శత జయంతిని జరుపుకుంటున్నాం. ఆయన దూరదృష్టి గల సినీ రూపకర్త, నటుడు, వెండితెర సార్వభౌముడు. ఆయన భారతీయ, అంతర్జాతీయ చిత్ర రంగంపై తరాలు మారినా చెరగని ముద్ర వేశారు"

"శ్రీ రాజ్ కపూర్‌కు చిన్న వయసులోనే సినిమాపై ఆసక్తి ఏర్పడింది. ఆదర్శవంతమైన కథకుడిగా ఎదిగేందుకు కష్టపడి పనిచేశారు. ఆయన సినిమాలు- కళానైపుణ్యం, భావుకత, సామాజిక వ్యాఖ్యానాల సమ్మేళనం. అవి సామాన్యుల ఆకాంక్షలను, వారు సాగించే జీవన సమస్యల్ని ప్రతిబింబిస్తాయి".

"రాజ్ కపూర్ చిత్రాల్లోని పాత్రలు, మరచిపోలేని మధుర గీతాలు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నాయి. వైవిధ్యమైన ఇతివృత్తాలను సులభంగా, గొప్పగా చిత్రీకరించిన ఆయన పనితీరును ప్రజలు మెచ్చుకుంటారు. ఆయన సినిమాల్లోని సంగీతం కూడా ప్రజాదరణ పొందింది.

"శ్రీ రాజ్ కపూర్ చిత్ర దర్శకుడు మాత్రమే కాదు భారతీయ సినిమాను అంతర్జాతీయ స్థాయికి చేర్చిన సాంస్కృతిక రాయబారి. తరాలు మారినా చిత్ర దర్శకులు, నటులు ఆయన నుంచి నేర్చుకోవాల్సింది చాలానే ఉంది. సృజనాత్మక ప్రపంచానికి ఆయన చేసిన సేవల్ని గుర్తు చేసుకుంటూ.. మరోసారి ఆయనకు నివాళులు అర్పిస్తున్నాను".

# శబరిమలకు వెళ్తున్న అయ్యప్ప భక్తుల బస్సును కారు ఢీకొన్న కారు

## -పెళ్లయిన 15 రోజులకే రోడ్డు ప్రమాదంలో నవ వధూవరులు దుర్మరణం

కేరళ డిసెంబర్ 156 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );కేరళలో తీవ్ర విషాదం నెలకొంది. పెళ్లయిన 15 రోజులకే రోడ్డు ప్రమాదంలో నవ వధూవరులు దుర్మరణం చెందారు. శబరిమలకు వెళ్తున్న అయ్యప్ప భక్తుల బస్సును కారు ఢీకొట్టడంతో నవ దంపతులు సహా నలుగురు ప్రాణాలు కోల్పోయారు.కేరళలోని పథానంతిట్టకు చెందిన అను, నిఖిల్‌కు 15 రోజుల కిందట వివాహమైంది.

పెళ్లి తర్వాత హనీమూన్‌కు మలేసియాకు వెళ్లి ఇవాళ తిరిగి కేరళకు వచ్చారు. ఈ క్రమంలో తిరువనంతపురంలో కొత్త దంపతులను రిసీవ్ చేసుకోవడానికి నిఖిల్ తండ్రి మథాయ్ ఈపన్, అను తండ్రి జార్జ్ బిజులు వెళ్లారు. వారంతా కారులో బయల్దేరి సొంతూరికి వెళ్తుండగా ఆదివారం ఉదయం 4.05 గంటల ప్రాంతంలో పనలూరు-మువట్టుపుజ రహదారిపై పథానంతిట్ట జిల్లా మురింజకల్ వద్ద ప్రమాదం జరిగింది.

# టెన్నిస్ క్రీడాకారిణి రిషితా రెడ్డికి సన్మానం




హైదరాబాద్ డిసెంబర్ 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); తెలంగాణ నెంబర్ వన్ జూనియర్ టెన్నిస్ ప్లేయర్ రిషితా రెడ్డిని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి సన్మానించారు.

తన అద్భుతం మైన ప్రతిభతో రాణిస్తూ, అతి తిన్న వయసులోనే మూడు అంతర్జాతీయ జూనియర్ టైటిల్స్ నెగ్గి తెలంగాణ ఖ్యాతిని ఇనుమడింప చేస్తున్నందుకు ఆయన రిషితారెడ్డిని అభినందించారు.

రేపటినుండి సింగపూర్ లో ప్రారంభం కానున్న ఐ సి రాడ్ లేవర్ కప్ కు ఇండియా టీంకు ప్రాతినిధ్యం వహిస్తున్న రిషితా రెడ్డి ఈరోజు సింగపూర్ కు బయలుదేరి వెళ్లింది.

రిషితా రెడ్డి ఇండియా జూనియర్ టెన్నిస్ విభాగంలో నెంబర్ 3 ర్యాంకులో కొనసాగుతుండగా, అంతర్జాతీయ స్థాయిలో 108వ ర్యాంకులో కొనసాగుతుంది.

రిషితా రెడ్డికి ఎంతో మంచి భవిష్యత్తు ఉందని, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్ర కీర్తి పతాకాన్ని ఎగరవేస్తుందన్న విశ్వాసాన్ని శివసేన రెడ్డి వ్యక్తం చేశారు

# గ్రీన్ ఎనర్జీ పాలసీ ముసాయిదా త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది

## - టిఎస్పిడిసిఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ,

## -ముగిసింది ఎంఎస్ఎంఇ క్లీన్ ఎనర్జీపై నిర్వహించిన అంతర్జాతీయ సమావేశం



హైదరాబాద్ డిసెంబర్ 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఎంఎస్ఎంఇ లు పెద్ద కంపెనీలతో సమానంగా ప్రభుత్వం నుండి ప్రయోజనం పొందాలని తెలంగాణ ప్రభుత్వం ఇంధన శాఖ, మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా అన్నారు. హెచ్ఐసిసి లో ఎంఎస్ఎంఇ క్లీన్ ఎనర్జీపై నిర్వహించిన అంతర్జాతీయ సమావేశం ముగింపు సమావేశం లో ఆయన పాల్గొని ప్రసంగించారు. భవిష్యత్తులో బ్యాంకుల నుంచి రుణాలు పొందాలంటే బ్యాలెన్స్ షీట్లు, ఈఎస్జీ నివేదికలు అవసరమని నిపుణులు తెలిపారు. భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ మద్దతుతో తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఈఐఅఐ) యొక్క ఎనర్జీ కమిటీ క్లీన్ ఎనర్జీపై అంతర్జాతీయ సదస్సును నిర్వహించింది. శనివారం మాదాపూర్‌లోని హెచ్ఐసిసిలో ఉద్గారాల రహిత వృద్ధి మరియు సమర్థవంతమైన పారిశ్రామిక వ్యవస్థను ప్రోత్సహించడానికి ఓఎంఇల కోసం ఇది నిర్వహించబడింది. ఈ సమావేశం శనివారం లేటు సాయంత్రం ముగిసిందితెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఈ వేడుక ముగింపు కార్యక్రమం లో ప్రసంగిస్తూ రాష్ట్రం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న గ్రీన్ ఎనర్జీ పాలసీ సిద్ధమవుతోందని, త్వరలో ప్రారంభించేందుకు సిద్ధమవుతుందని అన్నారు. ఆయన ఇంకా మాట్లాడుతూ గ్రీన్ ఎనర్జీ పరంగా తెలంగాణకు అపారమైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. తెలంగాణ సామర్థ్యం అద్వితీయం. ఇది భూపరివేష్టిత రాష్ట్రం. ఇది నిర్దిష్ట ప్రయోజనాలు మరియు సవాళ్లను కలిగి ఉంది. భారతదేశంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఇదే. విద్యుత్ నుండి గ్రీన్ ఎనర్జీకి మారడం కూడా సవాలుగా మారడానికి ఇదే కారణం అని ఆయన అన్నారు. ఆయన ఒక స్టార్టప్ ద్వారా తీసుకువచ్చిన ఎఐ-ఆధారిత ప్లాట్‌ఫారమ్‌ను ఆవిష్కరించారు. ఇది క్రియాశీల అంతర్దృష్టులను అందిస్తుంది మరియు శక్తిని ఆదా చేయడానికి మరియు విద్యుత్ బిల్లులను తగ్గించడానికి వినియోగదారులను శక్తివంతం చేస్తుంది. భారతదేశం నలుమూలల నుండి 400 మందికి పైగా ప్రతినిధులు ఈ రోజు సెషన్‌లో పాల్గొన్నారు. ఈ సదస్సు జర్మనీ, థాయ్‌లాండ్, శ్రీలంక నుండి అంతర్జాతీయ వక్తలను కూడా ఆకర్షించింది. 10 కంటే ఎక్కువ దేశాల నుండి అనేక మంది ప్రతినిధులు అదే కార్యక్రమంలో పాల్గొనేందుకు నగరానికి వచ్చారుఓఎంఇలు తప్పనిసరిగా పెద్ద కంపెనీలకు సమానంగా ప్రభుత్వం నుండి మద్దతు మరియు ప్రయోజనాలను పొందాలని తెలంగాణ ప్రభుత్వ ఇంధన శాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా అన్నారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఒకరోజు సదస్సును ప్రారంభించారు. ప్రతి 7 మందిలో ఒకరు ఓఎంఇల ద్వారా ఉపాధి పొందుతున్నారు. ఎంఎస్ఎంఇలకు క్లీన్ ఎనర్జీ వాడడం తప్ప వేరే మార్గం లేదని ఆయన అన్నారు. సెమినార్‌కు సమ్మతించిన గౌరవ ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లి భట్టి విక్రమార్క మల్లు అనువాది కారణాల వల్ల హాజరుకాలేకపోయారని , ఈఐఅఐ ఎనర్జీ కమిటీ చైర్మన్ వినోద్ కుమార్ అగర్వాల్ తన థీమ్ వ్యాఖ్యలలో తెలిపారు. తెలంగాణలో మనకు 26 లక్షల ఓఎంఇలు ఉన్నాయి మరియు ఈ సదస్సు ఓఎంఇలను క్లీన్ ఎనర్జీ సొర్సెస్‌ని స్వీకరించేలా ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీ యుగం. ఇదే భవిష్యత్తు అని ఆయన ప్రకటించారు. ఇంధన పరివర్తన మరియు డీకార్బనైజేషన్‌లో ప్రభుత్వం ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని, సాఫీగా మారడానికి అవసరమైన మద్దతు మరియు మౌలిక సదుపాయాలను అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎఫ్‌టిసిసిఐకి చెందిన సీనియర్ విపి రవి కుమార్ మరియు విపి కెకె మహేశ్వరి కూడా హాజరయ్యారు. రోజంతా జరిగే సదస్సులో మూడు సెషన్‌లు ఉన్నాయి--ఒకటి క్లీన్ ఎనర్జీ, రెండవది డీకార్బనైజేషన్ మరియు చివరిది ఆర్థిక ఎంపికలపై. భవిష్యత్తులో బ్యాంకుల నుంచి రుణాలు పొందాలంటే బ్యాలెన్స్ షీట్లు, ఈఎస్జీ నివేదికలు అవసరమని నిపుణులు తెలిపారు.

# ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభల గోడ పత్రిక ఆవిష్కరణ




హైదరాబాద్ డిసెంబర్ 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల23 నుండి 25 సిద్దిపేట లో జరగబోయే ఏబీవీపీ రాష్ట్ర మహాసభల పోస్టర్ నుఎస్ఆర్ నగర్ టౌన్ లో పోస్టర్ ను విడుదల చేసారు. ఈ సందర్భంగా ఏబీవీపీ సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ చెర్క. బాలకృష్ణ మాట్లాడుతూ "అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ప్రపంచంలోనే అతిపెద్ద స్టూడెంట్ ఆర్గనైజేషన్ అన్నారు. వ్యక్తి నిర్మాణం ద్వారానే జాతీయ పునర్నిర్మాణం సాధ్యం అనే ఉద్దేశ్యంతో పనిచేస్తూ వివేకానందుని స్ఫూర్తితో, అంబేద్కర్ ఆశయ సాధనలో విద్యార్థులను జాతీయవాదులుగా చేస్తున్న విద్యార్థి సంఘం అన్నారు. అన్ని రంగాల విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అనునిత్యం పనిచేస్తూనే, ఎన్నో విద్యార్థి నిర్మాణాత్మక కార్యక్రమాలను నిత్యం చేస్తూనే,సామాజిక ఉద్యమాలను కూడా నిర్వహిస్తుంది. ఉంటుందని అన్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది ఏబీవీపీ యొక్క 43వ తెలంగాణ రాష్ట్ర మహాసభలు సిద్దిపేటలో డిసెంబర్ 23,24,25 తేదీలలో నిర్వహించడం జరుగుతుంది. ఈ రాష్ట్ర మహాసభలలో తెలంగాణలో నెలకొని ఉన్న విద్యారంగ,రాష్ట్ర,నిరుద్యోగ సమస్యలపై తీర్మానాల ప్రవేశపెట్టి ఉద్యమ కార్యాచరణ ప్రకటించడం జరుగుతుందని,ఈ మహాసభలకు విద్యార్థులు, మేధావులు,నిరుద్యోగులు విచ్చేసి విజయవంతం చేయవలసిందిగా పిలుపునిచ్చారు... ఈ కార్యక్రమం లో సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ బాలు,టౌన్ సెక్రటరీ నందు,సిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వంశీ, రాహుల్, తదితరులు పాల్గొన్నారు..

# మలక్ పేట బ్రేయిలి పార్కులో ఘనంగా వికలాంగుల దినోత్సవ వేడుకలు

## -బెయిలీ శిక్షణ కేంద్రాన్ని ప్రారంబించిన కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి రాందాస్ అత్వాలే ముఖ

హైదరాబాద్ డిసెంబర్ 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ప్రపంచ వికలాంగుల దినోత్సవం,మాస ఉత్సవాలలో భాగంగా ఫెడ్ ఆధ్వర్యంలో మలక్ పేట లూయిస్ బ్రేయిలి పార్కులో వికలాంగుల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి రాందాస్ అత్వాలే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లూయిస్ బ్రెయిన్ పార్క్ లోని ప్రతిమకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కంప్యూటర్, యోగా, బెయిలీ శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. సందర్భంగా ఆయనకు పలు సంఘాల నాయకులు సికింద్రాబాద్ లో నిర్వహించబడుతున్న అందుల ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాన్ని బోయిన్పల్లి లో ఉన్న జాతీయ మానసిక వికలాంగుల సంస్థ లో కలపాలని మంత్రికి విన్నవించారు. అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ సాధ్యమైనంత వరకు ఆ సంస్థ శిక్షణ సంస్థను ఎన్ఐబిహెచ్ లో కలిపే ప్రయత్నం చేస్తానన్నారు. అంతేకాకుండా ఫెడ్ ఆధ్వర్యంలో నిర్వహించే అన్ని రకాల కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తానన్నారు. సంస్థ ఎన్నో రకాలుగా వికలాంగులకు ఇతర అన్ని వర్గాలకు సేవ చేయడం అభినందించేదగ్గ విషయం అన్నారు. ఈ వేడుకల్లో పలువురు దివ్యాంగులకు అందులకు చేతి కర్రలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఫెడ్ చైర్మన్ గంగారాం,ప్రధాన కార్యదర్శి చెరుకు నాగభూషణం, వరల్డ్ పద్మశాలి ఫౌండేషన్ గంజి నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# 2027లోనే జమిలి ఎన్నికలు

## -వైసీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని విజయసాయి రెడ్డి పిలుపు

అమరావతి డిసెంబర్ 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి జమిలి ఎన్నికలపై కీలక వ్యాఖ్యలు చేశారు. జమిలి ఎన్నికల్లో భాగంగా 2027లోనే ఎన్నికలు వస్తాయని, వైసీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. విశాఖ నగరంలో వైసీపీ కార్యాలయం ప్రారంభించిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యకర్తలనుద్దేశించి ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వస్తాయని, అసెంబ్లీ, ఎంపీ స్థానాలు పెరుగుతాయని అన్నారు. వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తారని వెల్లడించారు. గత ఆరు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో ఓడిపోయామన్న ఆందోళన అవసరం లేదని అన్నారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. నాయకులు కార్యకర్తలకు, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. మాజీ మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వైసీపీ నాయకులను ఇబ్బంది పెడుతుందని ఆరోపించారు. ఆరు నెలల్లో చంద్రబాబు ప్రభుత్వం 72 వేల కోట్లు అప్పు తెచ్చి సంక్షేమానికి 200 కోట్లు ఖర్చు చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, అరకు ఎంపీ తనూజ రాణి, వరుదు కల్యాణి, బుడి ముత్యాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడలో వేదిక కూలి తప్పిన పెను ప్రమాదం

అమరావతి డిసెంబర్ 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : ఏపీలోని కాకినాడలో వేదిక కూలి పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి నష్టం జరుగలేదు. కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) చైర్మన్‌గా జనసేనకు చెందిన తుమ్మలబాబును ప్రభుత్వం నామినేట్ చేసింది. ఆదివారం పదవి ప్రమాణం స్వీకారం ఏర్పాటు సందర్భంగా అధికారులు వేదికను ఏర్పాటు చేశారు. ఈ వేదికపై చైర్మన్‌తో పాటు టీడీపీ సీనియర్ నాయకుడు. మాజీ మంత్రి యనమల రామకృష్ణ , మరో నేత పంతం నానాజీతో పాటు పరిమితికి మించి వేదికపై వచ్చారు. దీంతో వేదిక ఒక్కసారిగా కూలిపోవడంతో అందరూ కింద పడ్డారు. వేదిక ఎత్తు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అనంతరం కింద పడ్డ నాయకులను సురక్షితంగా కాపాడారు. కొద్దిసేపు తరువాత ప్రమాణస్వీకారం యథావిధిగా కొనసాగింది.

# వైసీపీ హయాంలో రాష్ట్రం తిరోగమనం

## -ప్రజలకు మంచి చేసే వ్యక్తులను ఎప్పుడూ గుర్తించుకోవాలి

## - ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి డిసెంబర్ 15 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : ప్రజలకు మంచి చేసే వ్యక్తులను, చెడు చేసే నాయకులను ఎప్పుడూ గుర్తించుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రజలను కోరారు. గత వైసీపీ పాలనలో రాష్ట్రం తిరోగమనంలో పయనించిందని ఆరోపించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. స్ఫూర్తినిచ్చిన నాయకులను గుర్తుపెట్టుకుంటూనే 2014-19లో టీడీపీ అందించిన పాలనను గుర్తించుకోవాలని సూచించారు. 2019-24వరకు ఉన్న వైసీపీ అన్ని రంగాలను నిర్వీర్యం చేయడంతో పాటు టీడీపీ చేపట్టిన అభివృద్ధిని ప్రభుత్వం పక్కనపెట్టిందని విమర్శించారు. అమరావతిని, పోలవరాన్ని వైసీపీ నాశనం చేసిందని పేర్కొన్నారు. 2019లో వైఎస్ జగన్‌ప్రజల నెత్తిన చెయ్యిపెట్టి, ఆస్తులే రాయించుకునే పరిస్థితి తీసుకొచ్చారని ఆరోపించారు. గత ఐదేళ్లు రాష్ట్ర ప్రజలు స్వేచ్ఛను కోల్పోయారని వెల్లడించారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ సమాజమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కేంద్రంలో ఏపీ పరపతి పెరిగింది కాబట్టి అప్పుడప్పుడు ఆర్థికంగా సహాయం చేస్తూ ఆక్సిజన్ అందిస్తున్నారని వివరించారు.

# ప్రజాస్వామ్యంతో పాటు రాజ్యాంగం బలాన్ని పుంజుకొన్నాయి: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, డిసెంబర్ 16:రాజ్యాంగాన్ని ఆమోదించుకొని 75 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా లోక్‌సభలో చేపట్టిన ప్రత్యేక చర్చా కార్యక్రమంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ప్రసంగించారు. మనం ఈ ప్రజాస్వామ్య పండుగను నిర్వహించుకోవడం భారత పౌరులకే కాక పూర్తి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజలకు గర్వకారణమూ, గౌరవభరితమంటూ వ్యాఖ్యానించారు. మన రాజ్యాంగ 75వ వార్షికోత్సవ అసాధారణ, మహత్తర యాత్ర సందర్భంగా ఆయన రాజ్యాంగ నిర్మాతలు కనబర్చిన ముందుచూపునకు, వారి దార్శనికతకు, వారి కృషికి ధన్యవాదాలు తెలుపుతూ 75 సంవత్సరాలు విజయవంతంగా పూర్తి అయిన సందర్భంగా ప్రజాస్వామ్య ఉత్సవాన్ని జరుపుకోవలసిన తరుణమన్నారు. ఈ ఉత్సవంలో పార్లమెంటు సభ్యులు కూడా పాలుపంచుకొంటూ వారి అభిప్రాయాలను తెలియజేస్తున్నందుకు తాను సంతోషిస్తున్నానని శ్రీ మోదీ చెబుతూ, దీనికిగాను వారికి ధన్యవాదాలనూ, అభినందనలనూ తెలిపారు.

ఈ 75 సంవత్సరాల ఘట్టాన్ని ఒక అసాధారణ సన్నివేశంగా ప్రధాని అభివర్ణిస్తూ.. భారతదేశానికి స్వాతంత్ర్యం లభించిన వెంటనే దానికి ఎదురవుతాయనుకున్న అన్ని సంభావ్యతలనూ, ఆ తరువాత ఎదురైన సవాళ్లను రాజ్యాంగం అధిగమించి మనను ఇప్పటి స్థితికి చేర్చినందుకు గర్వంగా ఉందని ప్రధాని అన్నారు. ఈ మహత్కార్యాన్ని నెరవేర్చినందుకు రాజ్యాంగ శిల్పులకు, కోట్లాది మంది పౌరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యాంగంలో ఎలాంటి విలువలకు రాజ్యాంగ రూపకర్తలు స్థానం కల్పించారో ఆ విలువలను దేశ పౌరులు అలవర్చుకోవడంలో సఫలమై, ముందుకు సాగిపోతున్నారని శ్రీ మోదీ అన్నారు. ఈ కారణంగా ప్రశంసలు వాస్తవానికి దక్కాల్సింది పౌరులకేనని ఆయన అన్నారు.

భారత్ 1947లో పుట్టిందన్న ఉద్దేశాన్నో లేక రాజ్యాంగం 1950లో అమలులోకి వచ్చిందన్న ఉద్దేశాన్నో రాజ్యాంగ నిర్మాతలు ఎన్నడూ సమర్థించలేదు. అంతకన్నా వారు భారతదేశ ఘన సంప్రదాయాన్ని, ఘన వారసత్వాన్ని, భారతదేశ ప్రజాస్వామ్యాన్ని విశ్వసించి వాటిని చూసి గర్వపడ్డారని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. భారతదేశంలో ప్రజాస్వామ్యం, ఈ గణతంత్ర గత చరిత్ర ఎప్పటికీ ప్రశంసనీయంగానే ఉంటూ వస్తున్నాయనీ, ప్రపంచానికి ప్రేరణనిస్తున్నాయనీ ఆయన అన్నారు. ఈ కారణంగా, " ప్రజాస్వామ్యానికి జననిగా భారతదేశం పేరు తెచ్చుకొంది" అని కూడా ఆయన చెప్పారు. మనది ఒక గొప్ప ప్రజాస్వామిక దేశమనీ, ప్రజాస్వామ్యాన్ని ఆవిష్కరించిన దేశం కూడానని శ్రీ మోదీ చెప్పారు.

రాజ్యాంగ చర్చల్లో రాజర్షి పురుషోత్తం దాస్ టాండన్ చెప్పిన మాటలను ప్రధాని ప్రస్తావిస్తూ "శతాబ్దాలు గడిచాక, ఆ తరహా విశిష్ట సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇది మన ఘనమైన చరిత్రను, గతాన్నీ గుర్తుకు తెస్తోంది. అప్పట్లో మనం స్వతంత్రులం.. మేధావులం.. సభల్లో అర్థవంతమైన అంశాలను చర్చించడం, వాదోపవాదాలు చేయడం చేసేవాళ్లం" అని అన్నారు. డాక్టర్ ఎస్. రాధాకృష్ణన్ పలికిన మాటలను ప్రధాని ఉటంకిస్తూ "ఈ గొప్ప దేశానికి గణతంత్ర వ్యవస్థ ఒక కొత్త దృక్పథం ఏమీ కాదు. ఎందుకంటే మనకు మన చరిత్ర మొదలైనప్పటి నుంచీ ఈ వ్యవస్థ సుపరిచితమే''నని చెప్పారు. బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్ మాటలను ప్రధాని ప్రస్తావిస్తూ, "ప్రజాస్వామ్యం అంటే భారత్‌కు తెలియదని కాదు, భారత్‌లో అనేక గణతంత్రాలు మనుగడ సాగించిన కాలమంటూ ఒకటి ఉండింది" అని తెలిపారు.

రాజ్యాంగ రూపకల్పన ప్రక్రియలోనూ, రాజ్యాంగాన్ని మరింత శక్తిమంతం చేయడంలోనూ మహిళలు పోషించిన పాత్రను ప్రధానమంత్రి కొనియాడారు. రాజ్యాంగ పరిషత్తులో గౌరవనీయులైన, క్రియాశీలురైన 15 మంది సభ్యులు ఉండేవారు, వారు వారి నికార్సైన ఆలోచనలను, అభిప్రాయాలను, ఉద్దేశాలను ఇచ్చి రాజ్యాంగ ముసాయిదా రచన ప్రక్రియను మరింత బలోపేతం చేశారని ఆయన అన్నారు. వారిలో ప్రతి ఒక్కరూ భిన్నమైన నేపథ్యాలు కలిగినవారని శ్రీ మోదీ గుర్తుకు తెస్తూ, మహిళా సభ్యులు ఇచ్చిన ఆలోచనాపూర్వక సూచనలు, సలహాలు రాజ్యాంగంపైన ఎనలేని ప్రభావాన్ని ప్రసరించాయని స్పష్టంచేశారు. ప్రపంచంలో అనేక ఇతర దేశాలు మహిళలకు వోటుహక్కును ఇవ్వడానికి దశాబ్దాల కాలం పడితే, ఆ హక్కులను మన దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచే ఇవ్వడం చూస్తే గర్వంగా ఉందని కూడా ప్రధాని అన్నారు. ఇదే స్ఫూర్తితో, జి-20 శిఖరాగ్ర సమావేశానికి భారత్ అధ్యక్ష బాధ్యతను నిర్వహించిన కాలంలో మహిళల నాయకత్వంలో అభివృద్ధి సాధన అనే దృష్టికోణాన్ని ప్రపంచం ఎదుట ఆవిష్కరించిందని ఆయన వివరించారు. పార్లమెంటు సభ్యులంతా కలిసి నారీశక్తి వందన్ అధినియానికి చట్టరూపాన్ని ఇవ్వడంలో సఫలమయ్యారని కూడా శ్రీ మోదీ తెలియజేస్తూ, రాజకీయరంగంలో మహిళల ప్రాతినిధ్యం పెరిగేటట్టు ప్రభుత్వం చర్యలు తీసుకొందన్నారు.

ప్రతి ప్రధాన విధాన నిర్ణయంలో కేంద్ర స్థానంలో నిలిచింది మహిళలే అని శ్రీ మోదీ ప్రధానంగా చెబుతూ, రాజ్యాంగానికి 75 సంవత్సరాలు పూర్తయిన కాలంలో భారత రాష్ట్రపతి పదవిని ఒక గిరిజన మహిళ నిర్వహిస్తూ ఉండడం ఒక గొప్ప యాదృచ్ఛిక ఘటన అని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇది మన రాజ్యాంగ స్ఫూర్తిని మనం చేతల్లో చూపిస్తున్నామని చాటిచెబుతోందని ఆయన అన్నారు. పార్లమెంటులోనూ, మంత్రిమండలిలోనూ మహిళల ప్రాతినిధ్యం, పాత్ర నిరంతరంగా పెరుగుతున్నాయని ఆయన చెప్పారు. "సామాజిక, రాజకీయ, విద్యా, క్రీడల రంగం కావచ్చు లేదా మరే ఇతర రంగం కావచ్చు.. మహిళల ప్రాతినిధ్యమూ, మహిళల తోడ్పాటూ దేశానికి గర్వకారణమవుతూ వస్తున్నాయి" అని శ్రీ మోదీ గట్టిగా చెప్పారు. సైన్స్, టెక్నాలజీ రంగంలో, ప్రత్యేకించి అంతరిక్ష రంగంలో మహిళల తోడ్పాటులను చూసుకొని భారతదేశంలో ప్రతి ఒక్కరూ గర్వపడుతున్నారని ఆయన అన్నారు. దీనికి అత్యంత ఘనమైన ప్రేరణగా నిలిచింది మన రాజ్యాంగమే అని ఆయన అన్నారు.

భారతదేశం శరవేగంగా పురోగమిస్తోందని శ్రీ మోదీ పునరుద్ఘాటిస్తూ, త్వరలోనే భారత్ ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందన్నారు. భారత్‌ను 2047కల్లా అభివృద్ధి చెందిన దేశంగా చూడాలన్నదే 140 కోట్ల మంది భారతీయుల ఉమ్మడి సంకల్పం అని ఆయన చెప్పారు. ఈ సంకల్పాన్ని నెరవేర్చుకోవాలంటే భారతదేశ ఏకత అత్యంత ప్రధానమైన అవసరం అని కూడా ఆయన చెప్పారు. భారతదేశ ఏకతకు పునాదిగా ఉన్నది కూడా మన రాజ్యాంగమే అని ప్రధానమంత్రి తెలిపారు. రాజ్యాంగాన్ని సిద్ధం చేసే ప్రక్రియలో మహనీయులైన స్వాతంత్ర్య సమరయోధులు, రచయితలు, ఆలోచనపరులు, సామాజిక కార్యకర్తలు, విద్యావేత్తలు, ఇతర వివిధ రంగాలకు చెందిన వృత్తినిపుణులు పాలుపంచుకొన్నారని శ్రీ మోదీ గుర్తుచేస్తూ, వారంతా భారతదేశం ఐకమత్యంగా ఉండడం ఎంతో ముఖ్యం అనే వాస్తవం విషయంలో అత్యంత స్పందనశీలతను కనబరిచారన్నారు.

రాజ్యాంగ రూపకర్తల మనసుల్లోనూ, మేధలోనూ ఏకత నిండి ఉంటే, స్వాతంత్ర్యం వచ్చాక మాత్రం వక్రీకరణకు తావిచ్చిన మనస్తత్వాలు లేదా స్వార్థపరత్వం వంటి వాటి కారణంగా జాతీయ ఏకత అనే కీలక భావన మీద చాలా పెద్ద దెబ్బ కొట్టారని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అసంతోషాన్ని ప్రకటించారు. భిన్నత్వంలో ఏకత్వానికి మారుపేరుగా భారతదేశం ఉంటూ వచ్చిందని ప్రధాని ప్రధానంగా చెబుతూ, మనం వైవిధ్యాన్ని సంబరంగా జరుపుకొంటాం, దేశ ప్రగతి దీనిలోనే ఇమిడి ఉందన్నారు. ఏమైనా, వలసవాద మానసికతను కలిగిఉన్న వారు భారత్‌లో జరుగుతున్న మంచి విషయాలను చూడలేరు, భారత్ 1947లో పుట్టిందని నమ్మిన వారు ఈ భిన్నత్వానికి నిరాకరణలను కోరారని ఆయన అన్నారు. వివిధత్వం అనే అమూల్య ఖజానాను సంబరంగా జరుపుకొనేందుకు బదులుగా దానిలో- దేశ ఏకతకు హాని చేయాలనే ధ్యేయంతో- విషబీజాలను నాటేందుకు ప్రయత్నాలు జరిగాయన్నారు. భిన్నత్వాన్ని వేడుక చేసుకోవడాన్ని మన జీవనాల్లో ఒక విడదీయరానటువంటి భాగంగా చేసుకోవాల్సిందిగా ప్రతి ఒక్కరికి శ్రీ మోదీ విజ్ఞప్తి చేస్తూ, అదే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌కు సిసలైన నివాళి కాగలదన్నారు.

గత పదేళ్లలో, ప్రభుత్వ విధానాలు మన దేశ ఏకతను పటిష్టపరచాలనే లక్ష్యాన్ని కలిగి ఉంటూ వచ్చాయని ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ ప్రధానంగా చెప్పారు. రాజ్యాంగ 370వ అధికరణం దేశ ఏకతకు ఒక అడ్డంకిలా ఉండిందని ఆయన అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా దేశ ఏకత ఒక ప్రాధమ్యంగా ఉండిందని శ్రీ మోదీ పునరుద్ఘాటిస్తూ, ఈ కారణంగానే 370వ అధికరణాన్ని రద్దుచేశారన్నారు.

భారతదేశం ఆర్థికంగా పురోగమించడంతో పాటు ప్రపంచదేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షించాలంటే భారత్‌లో అనుకూల స్థితిగతులుండాల్సిన అవసరం ఉందని శ్రీ మోదీ ఉద్ఘాటించారు. వస్తువులు, సేవలపై పన్ను (జీఎస్టీ)పై చర్చలు దేశంలో చాలా కాలం నుంచీ కొనసాగుతున్నాయని ఆయన అన్నారు. ఆర్థిక ఏకతలో జీఎస్టీ సార్థక పాత్రను పోషించిందని ఆయన చెబుతూ, ఈ అంశంలో ఇదివరకటి ప్రభుత్వ తోడ్పాటును ఒప్పుకొన్నారు. జీఎస్టీని అమలుపరిచే అవకాశం, "వన్ నేషన్, వన్ ట్యాక్స్ (ఒకే దేశం, ఒకే పన్ను)" భావనను ముందుకు తీసుకుపోయే అవకాశం ప్రస్తుత ప్రభుత్వానికి దక్కాయని ఆయన అన్నారు.

రేషన్ కార్డులు మన దేశ పేదలకు ఎలా ఒక విలువైన పత్రంలా ఉంటున్నదీ శ్రీ మోదీ చెబుతూ, ఒక పేద వ్యక్తి ? అతడు గానీ, లేదా ఆమె గానీ ? ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి వెళ్లేటప్పుడు ఎదురయ్యే ఇబ్బందుల గురించీ, వారికి ఎలాంటి ప్రయోజనాలూ అందకపోవడాన్ని గురించీ ప్రస్తావించారు. ఈ విశాల దేశంలో పౌరులందరికీ- వారు ఎక్కడ ఉన్నారనే అంశంతో సంబంధం లేకుండా- సమాన హక్కులు ఉండాలని ఆయన స్పష్టంచేశారు. ఈ ఏకత భావనను బలపరచడానికి, ప్రభుత్వం "వన్ నేషన్, వన్ రేషన్ కార్డ్ (ఒకే దేశం, ఒకే రేషన్ కార్డు)" భావనను బలోపేతం చేసిందని ఆయన చెప్పారు.

పేదలకు, సామాన్య పౌరులకు ఆరోగ్య సంరక్షణ సేవలను ఉచితంగా అందిస్తే పేదరికంతో వారు పోరాడే సామర్థ్యం చెప్పుకోదగిన స్థాయిలో పెరుగుతుందని ప్రధానమంత్రి స్పష్టంచేశారు. ఆరోగ్య సంరక్షణ సేవలు వారు పనిచేసే చోట అందుబాటులో ఉంటూ ఉంటే, వారు ఆ చోటుకు దూరంగా వెళ్లినా ప్రాణాపాయ పరిస్థితులను ఎదుర్కొంటున్నా కూడా ఆరోగ్య సంరక్షణ సేవలు అందాలన్నారు. జాతీయ ఏకత సూత్రాన్ని పరిరక్షించడానికి ప్రభుత్వం "వన్ నేషన్, వన్ హెల్త్ కార్డ్ (ఒకే దేశం, ఒకే ఆరోగ్య కార్డు)" కార్యక్రమాన్ని ఆయుష్మాన్ భారత్ ద్వారా ప్రవేశపెట్టిందన్నారు. పుణెలో పనిచేసే బిహార్ దూరప్రాంతానికి చెందిన వ్యక్తి సైతం ఆయుష్మాన్ కార్డు తో అవసరమైన వైద్య సేవలను అందుకోగలుగుతారని ఆయన చెప్పారు.

దేశంలో ఒక ప్రాంతం విద్యుత్తు సదుపాయాన్ని కలిగి ఉంటే, మరో ప్రాంతం సరఫరాలో సమస్యల కారణంగా చీకటిలో మునిగి ఉండేదని, అటువంటి పరిస్థితులు కూడా ఉండేవని శ్రీ మోదీ ప్రధానంగా చెప్పారు. మునుపటి ప్రభుత్వాల పదవీకాలాల్లో, విద్యుత్తు సరఫరాలో అంతరాయాలకుగాను భారత్‌ను ప్రపంచవ్యాప్తంగా విమర్శించేవారని ఆయన అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టడానికి, ఏకతా మంత్రాన్ని స్థిరపరచడానికి ప్రభుత్వం "వన్ నేషన్, వన్ గ్రిడ్" (ఒకే దేశం, ఒకే గ్రిడ్) కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకువచ్చిందని ప్రధాని స్పష్టంచేశారు. ప్రస్తుతం, విద్యుచ్ఛక్తిని భారతదేశంలో మారుమూలలకూ ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా చేయడం సాధ్యమైందని ఆయన తెలిపారు.

దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిని గురించి ప్రధాని ప్రస్తావిస్తూ, జాతీయ ఏకతను బలపరచడానికి సంతులిత అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టిని కేంద్రీకరిస్తోందని ప్రధానమంత్రి స్పష్టంచేశారు. ఈశాన్య ప్రాంతం కావచ్చు, జమ్మూ- కశ్మీర్ కావచ్చు, హిమాలయ ప్రాంతాలుకావచ్చు లేదా ఎడారి ప్రాంతాలు కావచ్చు.. ప్రభుత్వం మౌలిక సదుపాయాలను సమగ్ర స్థాయిలో సమకూర్చడానికి ప్రభుత్వం చర్యలను చేపట్టిందని ఆయన తెలిపారు. అభివృద్ధి లోపించిన కారణంగా ఆమడ దూరంలో నిలిచిపోయాయన్న భావనను తొలగించి, తద్వారా ఏకతను పెంపొందించాలన్నదే ఈ కార్యక్రమం ధ్యేయమని, ఆయన అన్నారు.

కలిగిన వారికి, లేని వారికి మధ్య డిజిటల్ మాధ్యమం పరంగా విభజన ఉందని శ్రీ మోదీ స్పష్టంచేస్తూ, డిజిటల్ ఇండియాలో భారత్ సాధించిన విజయం ప్రపంచవ్యాప్తంగా గొప్ప గౌరవ భావనకు మూలం అయిందన్నారు. ఈ విజయంలో టెక్నాలజీ ప్రజాస్వామ్యీకరణ ఒక కీలక కారకం అయిందని ఆయన అన్నారు. రాజ్యాంగ నిర్మాతల దార్శనికత నుంచి మార్గదర్శకత్వాన్ని అందుకొని, జాతీయ ఏకతను బలపరచడానికి ఆప్టికల్ ఫైబర్ సేవలను భారతదేశంలోని ప్రతి పంచాయతీకి విస్తరించడానికి ప్రభుత్వం పనిచేసింది అని శ్రీ మోదీ వివరించారు.

ఏకత వర్ధిల్లాలని రాజ్యాంగం ఆశిస్తున్నదని, ఈ స్ఫూర్తితో మాతృభాష ప్రాముఖ్యాన్ని గుర్తించారని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. మాతృభాషను అణగదొక్కితే దేశ జనాభా సాంస్కృతికంగా సుసంపన్నులు కాలేరు అని ఆయన అన్నారు. నూతన విద్య విధానం మాతృభాషకు చెప్పుకోదగ్గ ప్రాముఖ్యాన్ని కట్టబెట్టిందని, తద్వారా నిరుపేదల పిల్లలు సైతం వారి స్థానిక ప్రాంత భాషల్లో వైద్యులుగాను, ఇంజినీర్లుగాను అయ్యే వీలును ఈ విద్య విధానం కల్పిస్తోందన్నారు. రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ మద్దతునిస్తుంది, వారి అవసరాలను తీర్చాలని ఆదేశిస్తోందని ఆయన అన్నారు. అనేక శాస్త్రీయ భాషలకు వాటికి న్యాయంగా దక్కాల్సిన స్థానాన్ని, గౌరవాన్ని ఇచ్చారని శ్రీ మోదీ ప్రధానంగా చెప్పారు. "ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్" ప్రచార ఉద్యమం జాతీయ ఏకతను బలపరుస్తూ, నవ తరంలో సాంస్కృతిక విలువలను పాదుగొల్పుతోందని ఆయన అన్నారు.

కాశీ తమిళ్ సంగమం, తెలుగు కాశీ సంగమంలు విశేష సంస్థాగత కార్యక్రమాలుగా పేరుతెచ్చుకొన్నాయని శ్రీ మోదీ చెబుతూ, ఈ సాంస్కృతిక కార్యక్రమాలు సామాజిక బంధాలను బలపరిచేవేనన్నారు. భారతదేశ ఏకతకున్న ప్రాధాన్యాన్ని రాజ్యాంగ కీలక సూత్రాల్లో గుర్తించారనీ, దీనిని ఒప్పుకోవాల్సిందేనని ఆయన చెప్పారు.

రాజ్యాంగం తన 75వ వార్షికోత్సవాన్ని జరుపుకొంటుండగా, 25 సంవత్సరాలు, 50 సంవత్సరాలు, 60 సంవత్సరాలు అనే ముఖ్య ఘట్టాలకు కూడా వాటి వంతు ప్రాధాన్యం ఉందని ప్రధానమంత్రి అన్నారు. చరిత్రను ఆయన గుర్తుకుతెస్తూ, రాజ్యాంగ 25వ వార్షికోత్సవం సందర్భంగా, దానిని దేశంలో ముక్కలుగా చించేశారన్నారు. ఎమర్జెన్సీ(అత్యవసర పరిస్థితి)ని విధించారు, రాజ్యాంగపరమైన వ్యవస్థలను నేలమట్టం చేశారు, దేశాన్ని ఒక జైలులాగా మార్చారు, పౌర హక్కులను లాగేసుకొన్నారు. పత్రికా స్వాతంత్ర్యాన్ని బందీని చేశారు అని ప్రధాని వివరించారు. ప్రజాస్వామ్యానికి గొంతు నులిమి ఊపిరాడకుండా చేశారు, రాజ్యాంగ రూపకర్తలు చేసిన త్యాగాలను పూడ్చిపెట్టే ప్రయత్నాలు జరిగాయని ప్రధాని అన్నారు.

రాజ్యాంగ 50వ వార్షికోత్సవాన్ని దేశప్రజలు 2000 నవంబరు 26న శ్రీ అటల్ బిహారి వాజ్‌పేయీ నాయకత్వంలో నిర్వహించుకొన్నారని శ్రీ మోదీ అన్నారు. శ్రీ అటల్ బిహారి వాజ్‌పేయీ ఒక ప్రధానమంత్రి గా దేశ ప్రజలకు ఒక ప్రత్యేక సందేశాన్నిచ్చారు. ఏకత, ప్రజల ప్రాతినిధ్యం, భాగస్వామ్యాలకున్న ప్రాధాన్యాన్ని ఆయన ప్రధానంగా చెప్పారని ప్రధాని అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని సజీవంగా నిలిపి, ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నది శ్రీ వాజ్‌పేయీ ప్రయత్నాల ధ్యేయమని ఆయన అన్నారు.

రాజ్యాంగ 50వ వార్షికోత్సవం సందర్భంగా... రాజ్యాంగ ప్రక్రియ ద్వారా ముఖ్యమంత్రి అయ్యే విశేషాధికారం తనకు దక్కిందని ప్రధాన మంత్రి అన్నారు. ముఖ్యమంత్రిగా తాను ఉన్న కాలంలో, గుజరాత్‌లో రాజ్యాంగ 60వ వార్షికోత్సవాన్ని నిర్వహించామని ఆయన చెప్పారు.



# మంచు కుటుంబంపై మూడు ఎఫ్ఐఆర్ లు నమోదు

## -రాచకొండ సీపీ సుధీర్ బాబు

హైదరాబాద్ డిసెంబర్ 16 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: మంచు



కుటుంబంపై మూడు ఎఫ్ఐఆర్ లు నమోదు చేసినట్లు రాచకొండ సీపీ సుధీర్ బాబు చెప్పారు. ఇటీవల మంచు మోహన్ బాబు, ఆయన చిన్న కొడుకు మంచు మనోజ్ ల మధ్య వివాదం నెలకొన్న సంగతి తెలిసిందే. వీరిద్దరూ ఒకరిపై ఒకరు తమ ప్రాణాలకు ప్రమాదం ఉందంటూ పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో మంచు ఫ్యామిలీ రచ్చ తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ అయ్యింది. తాజాగా మంచు ఫ్యామిలీ వివాదంపై స్పందించిన రాచకొండ సీపీ.. మంచు కుటుంబంపై మూడు కేసులు నమోదయ్యాయని? వాటిపై దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. లీగల్‌గా ఏది చేయాలో అది చేస్తామన్నారు. మోహన్‌బాబుకు ఇప్పటికే నో

# ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో దిగజారిపోతున్న పోలీసు వ్యవస్థ

## -ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సివిల్ రైట్స్ చైర్మన్ కరణం తిరుపతి నాయుడు

గుంటూరు డిసెంబర్ 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పూర్తిగా దిగజారిపోయిందని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సివిల్ రైట్స్ చైర్మన్ కరణం తిరువతి నాయుడు ఆరోపించారు..ఎటువంటి రాజకీయ పార్టీకి సంబంధం లేని వ్యక్తులపై కక్షపురిత దాడులు జరగడం తో రాష్ట్రము లో భయానక వాతావరణం నేలకుంటుందని ఆయన పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వం హయం లోకూడా ఇలాంటి దాడులే జరిగాయని, వాటితో ప్రజలు విసిగి వేసారి తెలుగుదేశం ప్రాణభుత్వాన్ని ఎన్నుకుంటే పేనం లోంచి పొయ్యెలో పడ్డ చందం గా పేదల బ్రతుకులు మారాయని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. వైసిపి నుండి టిడిపిలో చేరిన వ్యక్తులే ఈ దాడులకు పాల్పడుతున్నట్లు స్పష్టమవుతుంది అని నాయుడు ఆరోపించారు.శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండలం ఎం అవలింగి గ్రామంలో 2022 -2023 లో ఐదుగురు వ్యక్తులు అనుమానాస్పద మృతి చెందడం అప్పట్లో సర్వత్ర చర్చనీయాంశం అయింది అన్నారు. గ్రామంలో ఇద్దరు వ్యక్తులు కాల్మని వ్యాపారం వల్ల ఇద్దరు, రాజకీయ కక్షలతో ఒకరు వేధింపుల వల్ల చనిపోవడం బాధాకరం. ఇప్పటివరకు ఈ మరణాల పై పోలీసులు ఎలాంటి దర్యాప్తు చేపట్టలేదని, అప్పట్లో వైసీపీ పార్టీలో కీలకంగా వ్యవహరించిన సర్పంచ్ అనుచరులు వలన ఐదుగురు చనిపోయారు అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం వారు వైసీపీ నుండి టిడిపిలో చేరుకోవడం వల్ల వారిపై ఎలాంటి కేసులు నమోదు చేయబడడం లేదు అని స్పష్టమవుచున్నది. అదేవిదంగా పల్నాడు జిల్లా దుర్గి మండలం పోలేపల్లి గ్రామంలో ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు పాలువాయి బ్రహ్మారెడ్డి అనుచరులు అంగన్వాడీ టీచరును తన విధులకు రాజీనామా చేయాలనీ,అంగన్వాడీ టీచర్ పై మూకుమ్మడి దాడికి పాల్పడ్డారని తెలిపారు. వీరు అంత టిడిపి పార్టీ కి చెందిన రెడ్డి సామాజిక వర్గం వారు కావడం గమనార్హమన్నారు. పేదలకు అండగా నిలువవలసిన పోలీసులు అధికార పార్టీ ,అగ్రవర్ణాల వారికి కొమ్ము కాస్తూ, ఎఫ్ఐఆర్ నమోదు చెయ్యకపోవటం శోచనీయమన్నారు.అసలు మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా లేదా రౌడీయిజంలో ఉన్నామా అన్న అనుమానం కలుగుతుందన్నారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్రము లో అనేకం జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడమ లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు.,ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి డి జి పి స్పందించి రాష్ట్రంలో జరుగుతున్న ఇలాంటి అరాచక దాడులపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని తిరుపతినాయుడు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సుప్రీంకోర్టులో ఫిర్యాదు చేయనున్నట్టు ఆయన వెల్లడించారు.

# మరో డ్రామాకు తెర తీసిన సీఎం చంద్రబాబు

## -వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్

అమరావతి డిసెంబర్ 16 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఏపీ సీఎం చంద్రబాబు మరో డ్రామాకు తెర తీశారని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ఆరోపించారు. ప్రజలను మభ్యపెట్టడానికి, మాయచేడానికి ఇదొక ఎత్తుగడ వేశారని ట్వీటర్‌లో ఆరోపించారు. చంద్రబాబు విడుదల చేసిన పత్రంలో రాష్ట్రం అవసరాలకు, ప్రజల అవసరాలకు చోటేలేదని, వాస్తవిక దృక్పథం అంతకన్నా లేదని విమర్శించారు. తన మేనిఫెస్టోలో చెప్పినవాటి అమలు మీద ఎప్పుడూ ధ్యాస ఉండదని, ఎప్పుడూ ప్రజలను మోసం చేయడం, ప్రజలను మాయ చేయడం మీదనే తన ధ్యాసంతా ఉంటుందని ఎద్దేవా చేశారు. 1998లో విజన్-2020 పేరిట డాక్యుమెంట్ విడుదల చేయడం ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో అదొక చీకటి అధ్యాయమని అన్నారు. రైతుల ఆత్మహత్యలు, పనులకోసం వలసలు, ఉపాధిలేక, ఉద్యోగాల్లేక అష్టకష్టాలు, వీటన్నింటినీ దాచేసి చంద్రబాబు తన విజన్ చుట్టూ నడిపించిన ప్రచారం అంతా ఇంతా కాదని వెల్లడించారు.స్విట్జర్లాండ్‌కు చెందిన అప్పటి ఆర్థిక మంత్రి పాస్కల్ హైదరాబాద్ వచ్చిన సందర్భంలో విజన్ డాక్యుమెంట్లు పేరిట ఇలా అబద్ధాలు చెప్పేవారిని మా దేశంలో అయితే జైలుకో, లేకపోతే ఆస్పత్రికో పంపిస్తామని కామెంట్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. 2014లో కూడా విజన్-2029 డాక్యుమెంట్ ప్రచార ఆర్భాటంగానే మిగిలిపోయిందని విమర్శించారు.తన పరిపాలనలో మొత్తం 3 విజన్లు ప్రకటించిన చంద్రబాబు చిరస్థాయిగా నిలిచిపోయే పని ఒక్కటంటే ఒక్కటి కూడా చేయలేదని దుయ్యబట్టారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను గంగలో కలిపిన పాలకుడిని చీటర్ అంటారు కాని, విజనరీ అంటారా? అని ప్రశ్నించారు. విజన్-2047 ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2.4 ట్రిలియన్ డాలర్లు చేస్తానంటూ చంద్రబాబు కట్టుకథ చెబుతున్నాడని ఆరోపించారు.రాష్ట్రంలో నెలకొన్న సమస్యలకు వైసీపీ దీర్ఘకాలిక పరిష్కారం చూపుతూ అసమానతలు రూపుమాపి, అందరికీ సమాన అవకాశాలు కల్పించిందని పేర్కొన్నారు. సుస్థిర అభివృద్ధి దిశగా అనేక చర్యలు తీసుకుందని వెల్లడించారు. పేదలకు ప్రవేశపెట్టిన పథకాలు తొలగించి మరింత పేదవాళ్లుగా చంద్రబాబు తయారు చేస్తున్నాడని విమర్శించారు.

# సంస్కరించడం, పనిచేయడం, మార్పు తీసుకురావడం, సమాచారం ఇవ్వడం.... ఈ అంశాలపై దృష్టి కేంద్రీకరించాలి: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, డిసెంబర్ 16:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ఢిల్లీలో 'ప్రధాన కార్యదర్శుల నాలుగో జాతీయ సదస్సు'ను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సదస్సును మూడు రోజుల పాటు 2024 డిసెంబరు 13 నుంచి 15 వరకు ఢిల్లీలో నిర్వహించారు.

'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారతదేశం)ను ఆవిష్కరించడానికి టీమ్ ఇండియా ఎలాంటి అరమరికలకూ తావు ఇవ్వకుండా చర్చించుకోవడానికీ, కలిసికట్టుగా కృషి చేయాలనీ, ఇది ఈ సదస్సుతో లభించిన అతిపెద్ద ప్రయోజనమని ప్రధానమంత్రి అన్నారు.

ప్రజలకు అనుకూలమైన విధానాలతో, ఏదైనా ఒక సమస్య ఎదురవకముందే ఆ విషయాన్ని పట్టించుకొని తగిన జాగ్రత్తలు తీసుకొంటూ సుపరిపాలనను అందించడం (ప్రో-పీపుల్ ప్రో-యాక్టివ్ గుడ్ గవర్నెన్స్.. పీ2జీ2) మన కర్తవ్యపాలనలో కీలకమని, ఈ పద్ధతిలో మనం 'వికసిత్ భారత్' ఆశయాన్ని సాధించవచ్చని ప్రధానమంత్రి అన్నారు.

'ఔత్సాహిక పారిశ్రామికత్వాన్ని, ఉపాధికల్పనను, నైపుణ్యాల సాధనను ప్రోత్సహించడం, దేశ జనాభాలో శ్రమించే వయోవర్గాల సంఖ్య అధికంగా ఉన్నందున ఆ ప్రయో జనాన్ని సద్వినియోగపరచుకోవడం' ప్రధాన ఇతివృత్తంగా ఈ సదస్సు చర్చించింది.

అంకుర సంస్థలు రంగంలోకి ప్రవేశించడాన్ని, ప్రత్యేకించి ఇవి రెండో అంచెనగరాల్లోనూ మూడో అంచె నగరాల్లోనూ ఏర్పాటవుతుండడాన్ని ప్రధాని ప్రశంసించారు. ఆ తరహా నవకల్పనలను రాష్ట్రాలు ప్రోత్సహిస్తూ, అంకుర సంస్థలు వృద్ధి చెందడానికి అనువైన స్థితిగతుల్ని కల్పించే దిశలో కృషి చేయాలని ఆయన సూచించారు. చిన్న నగరాల్లో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా ఉండే ప్రదేశాల్ని గుర్తించి, ఆయా ప్రదేశాలను బ్యాంకింగ్ వ్యవస్థతో జతపరిచడంతోపాటు ఆధునిక వస్తురవాణా వ్యవస్థను సమకూర్చాల్సిందిగా రాష్ట్రాలను ఆయన కోరారు.

కొన్ని నియమాలను పాటించడంలో పౌరులు తరచు ఇబ్బందులకు గురిఅవుతున్న కారణంగా, ఆయా నియమ నిబంధనలను సరళతరం చేయాల్సిందిగా కూడా రాష్ట్రాలను ప్రధాని కోరారు. పౌరుల ప్రాతినిధ్యాన్ని ప్రోత్సహించేటట్లు పాలన నమూనాను రాష్ట్రాలు సంస్కరించాలని సమావేశంలో పాల్గొన్న సభికులకు ఆయన సూచించారు. సంస్కరణలను తీసుకురావడం, వాటిని ఆచరణలో పెట్టడం, వీలైన మార్పుచేర్పులను చేపట్టడంపై దృష్టి సారించడం ముఖ్యం. అంతేకాదు, ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ కార్యక్రమాల సమాచారాన్ని ప్రజలకు తెలియజేయడం కూడా అంతే ముఖ్యమని ప్రధాని అన్నారు.

చక్రభ్రమణ ఆర్థిక వ్యవస్థను (సర్క్యులర్ ఎకానమీ) ని ప్రధాని ప్రస్తావించి, గోబర్ధన్ కార్యక్రమాన్ని ప్రస్తుతం ఒక ప్రధాన ఇంధన వనరుగా లెక్కలోకి తీసుకోవడాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమం వ్యర్థాల నుంచి సంపదను సృష్టిస్తుందని, అంతేకాకుండా వయసు మీదపడిన పశువులను గుదిబండలుగా ఎంచకుండా వాటిని ఒక సంపత్తిగా ఉపయోగించుకొనే పద్ధతిని తెలియజేస్తుందని ఆయన అన్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలను (ఈ-వేస్ట్) తిరిగి ఉపయోగించడానికిగాను సముచిత వయబులిటీ గ్యాప్ ఫండింగ్ విధానాల్ని అన్వేషించాల్సిందిగా రాష్ట్రాలను ప్రధాని ఆదేశించారు. డేటా వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో టెక్నాలజీపైన సమాజం ఎక్కువగా ఆధారపడుతున్న ప్రస్తుత కాలంలో డిజిటల్ వ్యర్థాలు నానాటికీ పెరుగుతూంటాయని, ఈ సందర్భంలో ఇది ఎంతో ముఖ్యమైన అంశమని అన్నారు. ఈ-వేస్ట్‌ను ఉపయోగానికి అనువైన వనరుగా మార్చుకొనే ప్రక్రియనేది ఆ తరహా సామగ్రిని దిగుమతి చేసుకోవడంపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని ఆయన అన్నారు.

ఆరోగ్య రంగాన్ని గురించి ప్రధానమంత్రి మాట్లాడుతూ... ఫిట్ ఇండియా ఉద్యమ దృష్టికోణంలో స్థూలకాయం సమస్యను భారత్‌లో ఒక ప్రధాన సవాలుగా తీసుకోవాలని సూచించారు. దృఢమైన, ఆరోగ్యప్రదమైన భారతదేశం మాత్రమే వికసిత్ భారత్ (అభివృద్ధిచెందిన భారత్) కాగలుగుతుందని ఆయన అన్నారు. భారత్‌ను 2025 చివరికల్లా టీబీకి చోటుండని దేశంగా తీర్చిదిద్దవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ లక్ష్యాన్ని నెరవేర్చుకోవడంలో ఆశా కార్యకర్తలు, ఆంగన్‌వాడీ కార్యకర్తలు ఒక ప్రధాన పాత్రను పోషించగలుగుతారని ఆయన అన్నారు.

ప్రాచీన రాత పుస్తకాలు భారత్ సంపదగా ఉన్నాయని ప్రధాని వ్యాఖ్యానించారు. వాటిని డిజిటలీకరించడానికి టెక్నాలజీని ఉపయోగించుకోవాలని చెప్పారు. ఈ విషయంలో రాష్ట్రాలు చర్యలు తీసుకోవాలన్నారు. 'పీఎం గతిశక్తి' సుపరిపాలనకు ఎంతగానో తోడ్పడుతోందని ఆయన ప్రశంసిస్తూ, పిఎమ్ గతిశక్తిలో ఎప్పటికప్పుడు అవసరమైన తాజా మార్పులను చేసుకొంటూ, పర్యావరణ ప్రభావాలతోపాటు విపత్తులను ఎదుర్కొనే ప్రాంతాలను కూడా దీని పరిధిలోకి చేర్చాలని ఆయన సూచించారు.

ఆకాంక్షా జిల్లాలు, బ్లాకుల కార్యక్రమాన్ని గురించి ప్రధానమంత్రి మాట్లాడుతూ ఆయా జిల్లాల్లోనూ బ్లాకుల్లోనూ సమర్థులైన అధికారులను నియమించారని, వారు క్షేత్రస్థాయిలో పెనుమార్పులను తీసుకురాగలుగుతారని ప్రధాని అన్నారు. దీనితో విస్తృతస్థాయిలో సామాజిక, ఆర్థిక ప్రయోజనాలు కూడా లభిస్తాయన్నారు.

నగరాల అభివృద్ధిని ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ... నగరాలను ఆర్థిక వృద్ధి కేంద్రాలుగా అభివృద్ధి చేయాలంటే మానవ వనరుల వికాసాన్ని బాగా ప్రోత్సహించాలన్నారు. పట్టణ పరిపాలన, నీరు, పర్యావరణ నిర్వహణ రంగాలలో పట్టు సాధించడానికి ప్రత్యేక సంస్థలను ఏర్పాటుచేసేందుకు చొరవ తీసుకోవాలని ఆయన ప్రధానంగా చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో రాకపోకల సాధనాలు పెరిగిపోతూ ఉండడంతో, పట్టణ ప్రాంతాల్లో తగినంతగా వసతి సదుపాయాల్ని సమకూర్చడం ముఖ్యమని కూడా ఆయన స్పష్టం చేశారు. ఇది కొత్త పారిశ్రామిక కూడళ్లలో (ఇండస్ట్రియల్ హబ్స్) తయారీ రంగంలో మెరుగైన ఉత్పాదకతకు దారితీస్తుందన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను ప్రజాసేవకులందరికీ ఒక ప్రేరణ శక్తిగా అభివర్ణించారు. ఈరోజు సర్దార్ పటేల్ వర్ధంతి. ఆయన 150వ జయంతి కూడా ఈ సంవత్సరం లోనేనని ప్రధానమంత్రి శ్రీ మోదీ చెబుతూ, రాబోయే రెండు సంవత్సరాలను ఒక ఉత్సవం మాదిరిగా నిర్వహించుకోవాలి, అంతేకాకుండా భారతదేశం విషయంలో ఆయన కన్న కలను నెరవేర్చడానికి మనం శ్రమించాలన్నారు.

'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించడంలో భారతదేశంలో ప్రతిఒక్కరూ చురుకైన భాగస్వామ్యాన్ని పంచుకొనేటట్లు చూడాలని, ఈ సందర్భంగా స్వాతంత్ర్య ఉద్యమాన్ని ఒక ఉదాహరణగా తీసుకొని ముందుకు సాగాలని ప్రధాని కోరారు. మహిళలు, పురుషులు, బాలలు సహా జీవనంలో అన్ని రంగాలకు చెందిన వారు సైద్ధాంతిక అభిప్రాయ బేధాలను పక్కనపెట్టి స్వాతంత్ర్యపోరాటంలో పాలుపంచుకొన్నారని, అదే మాదిరిగా భారతదేశంలో ప్రతిఒక్కరూ 2047 కల్లా 'వికసిత్ భారత్'ను ఆవిష్కరించే దిశలో పనిచేసి తీరాలని ఆయన అన్నారు. దండి యాత్ర తరువాత 25 ఏళ్ళకు భారతదేశం స్వతంత్ర దేశంగా ఆవిర్భవించిందని, ఆ ఘటన అప్పట్లో చాలా పెద్ద విప్లవంగా పేరు తెచ్చుకొందని ప్రధాని చెబుతూ అదే తరహాలో 2047 కల్లా మనం 'వికసిత్ భారత్'గా మారాలని నిర్ణయించుకొంటే ఆ లక్ష్యాన్ని కూడా తప్పక సాధించగలుగుతామన్నారు.

మూడు రోజులపాటు జరిగిన సదస్సులో అనేక ప్రత్యేక ఇతివృత్తాలపై శ్రద్ధ తీసుకొన్నారు. వాటిలో తయారీ, సేవలు, గ్రామీణ వ్యవసాయేతర రంగాలు, పట్టణ ప్రాంతాలు, పునరుత్పాదక ఇంధనం, చక్రభ్రమణ ఆర్థికవ్యవస్థ వంటివి భాగంగా ఉన్నాయి.

# కార్మికుల సంక్షేమం కోసం కర పత్రాల ద్వారా ప్రచారం అభినందనీయం

## -లేబర్ సెల్ నాయకులను అభినందించిన పి సి సి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్.



హైదరాబాద్ డిసెంబర్ 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); కార్మికుల సంక్షేమం కోసం కర పత్రాల ద్వారా ప్రచారం చేయడం అభినందనీయమని పి సి సి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్.లేబర్ సెల్ నాయకులను అభినందించారు.టి. పి. సి. సి. లేబర్ సెల్ ద్వారా తెలంగాణ లో అన్ని జిల్లా లో నియోజకవర్గ లలో కర పత్రాల ద్వారా సభలు ద్వారా, తెలంగాణ భవన నిర్మాణ కార్మికులు, ఇతర నిర్మాణ కార్మికులు, మరియు , అన్ని వాణిజ్య సంస్థలో, పరిశ్రమల లలో పని చేసే అర్హులైన కార్మికుల సంక్షేమం కోసం కార్మిక సంక్షేమ మండలి ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, భీమా పథకాలు, సామజిక భద్రత కోసం, కార్మికుల హక్కుల కోసం మొదలగు ప్రయోజనాలు కార్మికుల కు వారి కుటుంబ సభ్యులకు ఉన్నందున వాటి ప్రయోజనాలు లబ్ధిపొందడం కోసం కార్మికులకు అవగాహనా కార్యక్రమాలు చేసేందుకు టి. పి. సి. సి. లేబర్ సెల్ కరపత్రాల ద్వార ప్రచార కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్బంగా లేబర్ సెల్ నాయకులూ గాంధి భవన్ లోటి.పి. సి. సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారికి వివరించి వారి చేతుల మీదుగా కర పత్రాలు ఆవిష్కరణ జరిపించారు. ఈ కార్యక్రమం లో రాంబాగ్ ప్రకాష్ గౌడ్ (చైర్మన్ ), నల్ల సంజీవ రెడ్డి , శ్రీ. సుజీత్ గాంధీ సప్పిడి భాస్కర్, కాందాడి సుదర్శన్ రెడ్డి, రమేష్, వీరేందర్ గౌడ్, తిరుపతి, మోహన్ రెడ్డి, మహేష్ , ం. శ్రీధర్ గౌడ్, ఎండీ నయీమ్, దుర్గా సింగ్, ఖాజా తదితరులు పాల్గొన్నారు

# తిరుపతి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ లిల్లీ మేరి

కొడంగల్ డిసెంబర్ 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్చార్జి తిరుపతి రెడ్డి ని కొడంగల్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీమతి లిల్లీ మేరిమర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్బంగా ఆయనకు పులా బోకె ఇచ్చి శాలువాతో సత్కరించారు.


ముఖే ముఖే సరస్వతి...

సరస్వతీ స్వరూపులైన సాహితీ వేత్తలకు, సాహితీ బంధువులకు,

సాహితీ ప్రేమికులకు 'లేఖిని రచయిత్రుల వేదిక' ఆహ్వానం

74 మంది రచయిత్రుల కథలతో సర్వాంగ సుందరంగా ముస్తాబైన

లేఖిని రచయిత్రుల కథా సంకలనం "కథల లోగిలి" ఆవిష్కరణ

శ్రీ కళాసుబ్బారావు కళా వేదిక,

త్యాగరాయ గానసభ, చిక్కడపల్లి, హైదరాబాద్

తేదీ: 20-12-2024

శుక్రవారం సమయం: ఉ. 10.00 నుంచి 1.00 వరకు

సాహితీ బంధువు డాక్టర్ కె. వి.రమణాచారి, IAS (Rtd)

'సుడిగుండాలు' ఫేం, ప్రముఖ నాట్య కళాకారిణి,

నాట్య కళామయూరి బిరుదాంకితురాలు డాక్టర్ ఆర్. ప్రసన్నరాణి,

డాక్టర్ వోలేటి పార్వతీశం ప్రముఖ సాహితీవేత్త

కందాళ ఉషారాణి, బుల్లితెర సీరియల్ రచయిత్రి

అతిథులుగా వేంచేయబోతున్నారు.

ప్రముఖ రచయిత్రి పొత్తూరి విజయలక్ష్మి అధ్యక్షతన

జరగబోయే ఈ వేడుక నిర్వహణ అత్తలూరి విజయలక్ష్మి

అందరు ఈ వేడుకలో పాల్గొనండి - సందడి చేయండి.

ఇట్లు

సరస్వతి కరవది,

కామేశ్వరి చెంగల్వల, నండూరి సుందరీ నాగమణి,

అల్లూరి గౌరీలక్ష్మి , ఇతర సభ్యులు.


# గత ఆరేండ్లలో ఎన్నడూ లేనంతంగా కనిష్ఠానికి పడిపోయిన ఉష్ణోగ్రతలు



హైదరాబాద్ డిసెంబర్ 16 (ఎక్స్ ప్రెస్స్ న్యూస్ );: హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. గత ఆరేండ్లలో ఎన్నడూ లేనంతంగా కనిష్టానికి పడిపోయాయి. హెచ్‌సీయూ, మౌలాలీలో అత్యల్పంగా 7.1 డిగ్రీలు, బీహెచ్‌ఈఎల్‌లో 7.4, రాజేంద్రనగర్‌లో 8.2, గచ్చిబౌలి 9.3, వెస్ట్ మారేడుపల్లి 9.9, కుత్బుల్లాపూర్, మచ్చబొల్లారం 10.2, శివరాంపల్లి 10.3, జీడిమెట్ల 11.4, బాలానగర్ 11.5, పటాన్‌చెరు 11.7, షాపూర్‌నగర్ 11.7, లింగంపల్లి 11.8, బోయిన్‌పల్లి 11.9, బేగంపేట 12, ఆసిఫ్‌నగర్ 12, నేరేడ్‌మెట్ 12.1, లంగర్‌హౌస్ 12.2, మోండా మార్కెట్ 12.4, చందానగర్ 12.7, షేక్‌పేట 12.8, మాదాపూర్ 12.8, ముషీరాబాద్ 12.9, చాంద్రాయణగుట్ట 13, కూకట్‌పల్లి 13.1, గోల్కొండ 13.2, సఫిల్‌గూడ, హయత్‌నగర్ 13.3, ఉప్పల్ 13.4, మల్లాపూర్ 13.5, ఆదర్శనగర్ 13.5, తిరుమలగిరి, చర్లపల్లి 13.6 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రాష్ట్రంలోనే అతితక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా బేలాలో 6.3 డిగ్రీలు రికార్డయ్యాయి. నిర్మల్ జిల్లా తాంద్రలో 6.3, ఆదిలాబాద్ జిల్లా పోచర 6.4, జైనాథ్ 6.5, అర్లి (టీ) 6.6, చాప్రాల్ 6.6, సంగారెడ్డి జిల్లా సత్వార్ 6.6, వికారాబాద్‌లోని బంట్వారం 6.7, సంగారెడ్డిలోని న్యాల్కల్‌లో 6.7, ఎలిమినేడు, రాచలూరు (రంగారెడ్డి) 6.7, సిర్పూర్ యూ (ఆసిఫాబాద్) 6.7, చందనపల్లి (రంగారెడ్డి) 6.7, కోహీర్ (సంగారెడ్డి) 6.7, మర్పల్లి (వికారాబాద్) 6.8, వికారాబాద్ జిల్లాలోని నగరం (టీ), మన్నెగూడలో 6.8, నల్లవెల్లి (సంగారెడ్డి) 6.8, పోతరరెడ్డిపేట (సిద్దిపేట) 6.9, జహీరాబాద్ (సంగారెడ్డి) 6.9, మెనూర్ (కామారెడ్డి) 6.9, రాఘవపేట (జగిత్యాల) 7.3, కెరమెరి (ఆసిఫాబాద్) 7.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉత్తరాది నుంచి ఈదురుగాలులు, శీతల పవనాలు వీస్తుండటంతో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. దీంతో ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు.

# అవినీతి.. కుట్రతో పోలవరం నాశనం.. సీఎం చంద్రబాబు

**-డ్యామేజీ పనుల్ని మళ్లీ చేయక తప్పటం లేదు**

**-రూ.2400 కోట్లు అదనపు ఖర్చు**

**-అయిదేళ్లలో 3.4శాతం పనులే చేశారు**

**-రూ.2,340 కోట్లు దారిమళ్లాయి**

**-రూ.2000 కోట్ల పనులు ఆగిపోయాయి**

**-2026 మే నాటికి పనులు పూర్తి చేయాలి**

**-ప్రస్తుతం రూ.12,157 కోట్లు మంజూరు**

**-రూ.2300 కోట్లు విడుదల చేశారు**

**-16,400 ఎకరాల భూమి అవసరం**

**-2026 నాటికి ఆర్ ఆర్ ప్యాకేజీ పూర్తి చేస్తాం**

**-పోలవరంలో చంద్రబాబు**

అమరావతి, డిసెంబర్ 16:అసమర్థత, అవగాహన రాహిత్యం, అవినీతి, కుట్రతో పోలవరాన్ని నాశనం చేశారని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టులో సోమవారం ఆయన పర్యటిస్తున్నారు. తొలుత పోలవరం ప్రాజెక్టు హిల్ వ్యూ హెలిపాడ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి హిల్ వ్యూ పాయింట్ నుంచి ప్రాజెక్టు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పనుల గురించి అధికారులు వివరించారు. పోలవరం పనులపై అధికారులు, ఇంజినీర్లతో చంద్రబాబు సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ? అప్పర్, లోయర్ కాపర్ డ్యామ్, డ్రమాఫ్రమ్ పనులను పరిశీలించామని, 2020లో వరద ఉధృతితో ఇవన్నీ దెబ్బతిన్నాయన్నారు. నిర్మాణాల కింద మట్టి కోతకు గురి కావటంతో 200మీటర్లలో మట్టి దెబ్బతిందని వివరించారు.

ఇప్పుడు ఇసుక తెచ్చి హైడ్రో కాంప్రెషన్ చేస్తున్నామని, ఈ పనులకు రూ. 2400కోట్లు అదనంగా ఖర్చవుతోందన్నారు. కొత్త దయాఫ్రం పనులకు రూ.950 కోట్లు ఖర్చు అవుతోందని, పాత డ్రయాఫ్రంను రూ. 450 కోట్లుతో పూర్తి చేశామన్నారు. , శాండ్ ఫిల్లింగ్ కు రూ.360 కోట్లు, డీ వాటరింగ్ కు రూ. 211కోట్లు ఖర్చు అవుతోందన్నారు. ఇక నిర్మాణ ఖర్చులూ పెరుగుతున్నాయన్నారు. కాస్ట్ సిమెంట్ రేట్లు , లేబర్ ఖర్చులు పెరిగాయన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.. 8,242 కోట్లు ఇస్తే రూ. 2,340 కోట్లు దారి మళ్లించారని, రూ. 2000 కోట్ల పనులు నిలిపి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. .తాము 70 శాతం పనులు పూర్తి చేస్తే గత ప్రభుత్వం కేవలం 3.84 శాతం పనులే చేసిందన్నారు. ఇక కాలువ ల పనులు జరగాలన్నారు. అంతర్జాతీయ నిపుణుల నివేదిక ప్రకారం ప్రధానికి, ఆర్థిక మంత్రిని నిధులు పెంచాలని అభ్యర్థించామన్నారు.

ఇప్పటి వరకూ ఫేజ్వన్ పనులు లేవు. కానీ త్వరిత గతిన అంచెల వారీగా ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం భావించిందని, రూ.12,157 కోట్లు మంజూరు చేసి రూ. 2300 కోట్లు విడుదల చేసిందని సీఎం చంద్రబాబు వివరించారు. వర్క్ స్పీడ్ పెంచటానికి పోలవరం ఎడమ కాలువ పనులు ప్రారంభించేందుకు అనకాపల్లి వరకూ టెండర్లు పిలిచామన్నారు. అప్రోచ్ రోడ్ల పనులు, డీవాటరింగ్ పనులు చేస్తామన్నారు. దెబ్బతిన్న దయాఫ్రం వాల్ పనులను పక్ వర్క్ స్టార్ట్ చేస్తున్నట్టు తెలిపారు. ఈ పనులను జనవరి 2న ప్రారంభిస్తామన్నారు. ఈసీఆర్ గ్యాప్ 1, ఈసీఆర్ గ్యాప్ 2 పనులను 2026 మే జూన్ లోపు చేస్తే.. మంచిదన్నారు. కుడికాలువ, ఎడమ కాలువ పనుల ఏడాదిన్నర లోపు పూర్తి చేయాలన్నారు. అప్రోచ్ పనులన్నీ.. స్పిల్ చానల్, పైలట్ చానల్ పనులు, రెగ్యులేటర్ పనులను 2027 ఫ్రిబ్రవరి నాటికి పూర్తి చేయాలన్నారు. ఈ పనులకు 16,400 ఎకరాల భూమిని సేకరించాలని, భూసేకరణను 2025 ఏప్రిల్ నాటికి.. ఆర్ ఆర్ ప్యాకేజీని 2026 నాటికి పూర్తి చేయాలని నిర్ణయం తీసుకున్నామని వివరించారు.

ఇది ఏపీకి జీవనాడి..

పోలవరం రాష్ట్రానికి జీవనాడి అని సీఎం చంద్రబాబు తెలిపారు. పోలవరం వల్ల 7.20 లక్షల ఎకరాలకు కొత్త ఆయకట్టు ఉందని తెలిపారు. 28 లక్షల మందికి తాగునీరు, 960 మెగావాట్ల విద్యుదుత్పత్తి ఉందని తెలిపారు. పోలవరం, అమరావతి రెండు కళ్లు అని చెప్పారు. పోలవరం పూర్తి చేసి నదుల అనుసంధానం చేస్తే ఏపీకి గేమ్ ఛేంజర్‌గా



తయారువుతుందని చెప్పారు. పట్టిసీమ ద్వారా కృష్ణా నదికి అనుసంధానం చేశామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. పోలవరం పూర్తి చేసి నదుల అనుసంధానం చేస్తే ఏపీకి గేమ్ ఛేంజర్‌గా తయారువుతుందని సీఎం చంద్రబాబు తెలిపారు.

పట్టిసీమతో కృష్ణానదికి అనుసంధానం..

పట్టిసీమ ద్వారా కృష్ణానదికి అనుసంధానం చేశాం. త్వరలో నేరుగా కృష్ణా నుంచి సాగర్ కెనాల్‌కు పూర్తి చేయాలి. గొల్లాపల్లి రిజర్వాయర్ వస్తే మనకు ఇబ్బంది ఉండదు.వెలిగొండ ఇరిగేషన్‌కు కూడా నీళ్లు ఇచ్చే పరిస్థితి వస్తుంది. అక్కడి నుంచి బనకచర్లకు నీళ్లు తీసుకెళ్లొచ్చు. విశాఖకు తరలిస్తూ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, వంశధారకు నీళ్లు.. ఇది పూర్తి చేయగలిగితే అన్ని జిల్లాలకు ఎంతో ఉపయోగం. శ్రీకాకుళం నుంచి కర్నూలు, నెల్లూరు, తిరుపతి వరకు నీటి సమస్య ఉండదు. ప్రాజెక్టు ప్రాముఖ్యత చూస్తే 50 లక్షల క్యూసెక్కులు డిశ్చార్జ్ చేసే సామర్థ్యం. 93 మీటర్ల దయా ఫ్రం వాల్ అత్యంత ఎత్తైన స్పిల్ వే గేట్లు ఉంటుంది. బహుళ ప్రయోజనాల కోసం వినియోగించే ప్రాజెక్టు పోలవరం" అని సీఎం చంద్రబాబు తెలిపారు.

# నర్సరీ నీటి కుంటలో పడి ఇద్దరు మృతి

అమరావతి, డిసెంబర్ 16: అది శ్రీ చైతన్య స్కూల్ బస్సు.. ఎన్నాళ్ళ నుంచి రిపేర్ చేయించలేదో ఏమో.. ఇంజన్ వేడెక్కి బస్సు ఆగిపోయింది.. రేడియేటర్ ను చల్లార్చేందుకు నీళ్లు కావాలి.. ఈ అవసరమే ఒక అనర్థాన్ని తెచ్చిపెట్టింది.. ఇద్దరు ప్రాణాలను బలి తీసుకుంది. ఈ విషాద ఘటన వివరాల్లోకి వెళ్తే.. పల్నాడు జిల్లా గురజాల మండలం పులిపాడు నుంచి శ్రీ చైతన్య స్కూల్ బస్సు యథావిధిగాని సోమవారం ఉదయం దాచేపల్లి కి బయలుదేరింది.



ఎప్పటిలానే పులిపాడు కు చెందిన ఐదో తరగతి విద్యార్థి సుభాష్ (11)ను ఆ తల్లి బస్సు ఎక్కించి భద్రం నాయనా అని చెప్పింది. సరే అమ్మ అంటూ వెళ్లిన ఆ బిడ్డ ఇక తిరిగిరాని లోకాలకు వెళ్లే మృత్యువు నీటి కుంట లోకంలో పొంచి ఉందని తెలియదు. దాచేపల్లి కి వెళ్తున్న స్కూల్ బస్సు ఇంజన్ కు సమస్య వచ్చింది. తీవ్రంగా వేడెక్కి పొగలు రావడంతో బస్సును నిలిపి వేయక తప్పింది కాదు. దీంతో క్లీనర్ కోటేశ్వరరావు రహదారి పక్కనే నర్సరీ లోకి ఒక డబ్బాను తీసుకొని దారి తీసాడు. అతనితోపాటు సుభాష్ కూడా వెళ్లాడు. నర్సరీ అవసరాల కోసం తీసిన నీటిగుంటలోకి క్లీనర్ దిగి డబ్బాను నింపి ఒడ్డునే ఉన్న పిల్లాడికి అందించాడు. పట్టా తడిగా ఉండటంవల్ల ఆ చిన్నారి షూ జారి నీటి కుంటలో పడిపోయాడు. పడటం పడటం క్లీనర్ కోటేశ్వరరావు మీద పడిపోవడంతో ఇద్దరూ అదుపుతప్పి నీల లోతుకు వెళ్లారు.

పిల్లాడికి, క్లీనర్ కోటేశ్వరరావు కి ఈత రాదు. కంగారుగా ఒడ్డుకు వచ్చే ప్రయత్నం చేస్తూ ఊపిరాడక ఇద్దరూ ఆ నీటి కుంటలోనే ప్రాణాలు వదిలారు. ఇద్దరి ప్రాణాలను బలిగొనడానికి కారణమైన బస్సును నిందించాలో.. బస్సు సమస్యను గుర్తించకుండా వాడుతున్న స్కూలు యాజమాన్యాన్ని నిందించాలో అర్థం కాక జనం తలపట్టుకున్నారు బడికెళ్ళొస్తానమ్మా అని బయలు దేరిన బిడ్డ నీటి కుంటలో పడి నిర్జీవిగా మారడం చూసి ఆ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

# రూ.కోటికి పైగా విలువ చేసే డ్రగ్స్ పట్టివేత

## -మధ్యప్రదేశ్ నుంచి అక్రమ రవాణా
## -మీర్ పేట తనిఖీలలో పట్టుకున్న రాచకొండ పోలీసులు
## -ముగ్గురు అంతరాష్ట్ర ముఠా సభ్యుల అరెస్ట్

హైదరాబాద్, డిసెంబర్ 16: రాచకొండ కమిషనరేట్ పోలీసులు భారీ డ్రగ్స్ రాకెట్ ను చేదించారు.. నేడు కోటి 25 లక్షల విలువచేసే 53.5 కిలోల మాదకద్రవ్యాలను నేడు పట్టుకున్నారు. మధ్యప్రదేశ్ నుంచి హైదరాబాద్ నగరానికి



మాదకద్రవ్యాల అక్రమ రవాణా చేస్తున్న అంతరాష్ట్ర రాకెట్‌ను మీర్‌పేట్ పోలీసులతో కలిసి ఎల్బీనగర్ జోన్ ఎస్ వో టి పోలీసులు ఛేదించారు. నిందితుల నుంచి కోటి 25 లక్షల విలువచేసే 53.5 కిలోల గసగసాల మాదక ద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అంతర్రాష్ట్ర ముఠాకు ముగ్గురిని అరెస్టు చేశారు. గసగసాల , ఎఫ్ ఎం వంటి మాదక ద్రవ్యాలను మధ్యప్రదేశ్ నుంచి హైదరాబాద్‌కి తరలిస్తుండగా పట్టుకున్నామని పోలీసులు తెలిపారు.

ఎన్ని కఠిన చర్యలు..

హైదరాబాద్ నగరాన్ని డ్రగ్స్ బూతం వీడటం లేదు. ఇప్పటి వరకు జిల్లాలు, రాష్ట్రాల నుంచి సరఫరా అయిన డ్రగ్స్ ఇప్పుడు ఏకంగా దేశాలను దాటించి మరీ హైదరాబాద్‌కు తీసుకువస్తున్నారు. ఎల్బీనగర్‌లో భారీగా డ్రగ్స్ పట్టుబడటం సంచలనంగా మారింది. అయితే హైదరాబాద్‌లో ఇటీవల భారీ మొత్తంలో డ్రగ్స్ పట్టుబడిన విషయం తెలిసిందే. డ్రగ్స్ సరఫరా చేస్తే కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వం, పోలీసులు చెప్పినప్పటికీ ఏదో విధంగా డ్రగ్స్‌ను సరఫరా చేస్తునే ఉన్నారు ముఠా సభ్యులు. ఇటీవల దాదాపు రూ.25 లక్షలు విలువల చేసే డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇంటర్నేషనల్ ఫెడ్లర్‌తో పాటు అంతర్రాష్ట్ర ఫెడ్లర్‌ను కూడా ఖాకీలు అదుపులోకి తీసుకున్నారు. అయితే తరచూ ఇలా డ్రగ్స్ పట్టుబడుతుండటం పోలీసులకు పెను సవాల్‌గా మారింది.

### హైదరాబాద్‌ను పట్టిపీడిస్తున్న డ్రగ్స్..

తెలంగాణను ముఖ్యంగా హైదరాబాద్ నగరాన్ని మత్తుపదార్థాలు పట్టిపీడిస్తున్నాయి. పోలీసులు, అధికారులు ఎన్ని చర్యలు చేపట్టినా రోజుల వ్యవధిలోనే కొత్తకొత్త డ్రగ్స్ కేసులు నగరంలో వెలుగు చూస్తున్నాయి. ఎస్.ఆర్.నగర్ బాయ్స్ హాస్టళ్ల కేంద్రంగా గంజాయి, డ్రగ్స్ అమ్మకాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. అలాగే నటి రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు సైతం డ్రగ్స్ కేసులో పోలీసులకు చిక్కిన సంఘటన సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఇవేగాకుండా ర్యాపిడో ద్వారా డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఘటనలు ఇటీవల వెలుగులోకి వచ్చాయి. పోలీసులు ఎన్ని కేసులు చేధించినా మత్తుపదార్థాల సరఫరాకు డ్రగ్ పెడ్లర్లు ఎప్పటికప్పుడు కొత్తదారులు వెతుకుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు.

డ్రగ్ పెడ్లర్లకు పోలీసుల హెచ్చరిక..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో తెలంగాణ పోలీసులు డ్రగ్స్ క్రయవిక్రయాలపై ఉక్కుపాదం మోపారు. జూబ్లీహిల్ పబ్బులు సహా పలు ప్రాంతాల్లో తరచూ తనిఖీలు చేస్తున్నారు. ఇటీవల పలువురు బడా పారిశ్రామికవేత్తలు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, విద్యార్థులు సైతం మత్తుపదార్థాలు వాడి తనిఖీల్లో పట్టుబడ్డారు. అయితే యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. డ్రగ్స్‌కు బానిసై విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని చెబుతున్నారు. బెంగళూరు నుంచి అధికంగా డ్రగ్స్ దిగుమతి అవుతున్నాయని, దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు చెబుతున్నారు. ఇప్పటికే పలువురు డ్రగ్ పెడ్లర్లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మత్తుపదార్థాలు సరఫరా చేస్తూ పట్టుపడితే కఠిన చర్యలు ఉంటాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# వంద సార్లు ఢిల్లీ టూర్...రైతులతో జైల్ భరో.. ఇదే రేవంత్ టూరిజం పాలసీ

హైదరాబాద్, డిసెంబర్ 16: అసెంబ్లీలో టూరిజమ్ పాలసీపై స్వల్పకాలిక చర్చ జరుగనున్న నేపథ్యంలో రెండు అంశాలపై తప్పక చర్చించాలన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. అందులో ఒకటి ఢిల్లీ టూరిజం, మరొకటి జైల్ టూరిజం అని చెప్పారు. ఈ రెండు అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎనలేని ప్రగతి సాధించిందన్నారు.

ఢిల్లీ టూరిజంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు వందసార్లకుపైగా దేశ రాజధానికి వెళ్లివచ్చారని చెప్పారు. వారి పర్యటనతో రాష్ట్రానికి రూపాయి ప్రయోజనం కూడా కలగలేదని విమర్శించారు. ఇక జైలు టూరిజంలో భాగంగా 40 మంది కొడంగల్ రైతులను జైలుపాలు చేశారన్నారు. సెలబ్రెటీ నటులను జైలుకు పంపించారని, బెయిల్ వచ్చినా విడుదల చేయలేదని మండిపడ్డారు. సోషల్ మీడియా వారియర్లను కటకటాలు లెక్కపెట్టేలా చేశారన్నారు. ఎల్అండ్ టీ చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్‌ను జైల్లో వేస్తామని బెదిరించారని ఆరోపించారు. దీనికి మీరేమంటారంటూ ట్వీట్ చేశారు.

# గ్రూప్-2 పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ




హైదరాబాద్, డిసెంబర్ 16:వికారాబాద్ జిల్లా కేంద్రంలోని గ్రూప్-2 పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి సోమవారం పరిశీలించారు. ఆదివారం సాయంత్రం ఓ పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థి సెల్ ఫోన్ తో వెళ్లడంతో పోలీసులు పరీక్షా కేంద్రం వద్ద తనిఖీలు చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రతి పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి పరిశీలించారు.

# ఏపీ నుండి ముగ్గురు రాజ్యసభ సభ్యుల ప్రమాణ స్వీకారం..



అమరావతి, డిసెంబర్ 16:ఆంధ్రప్రదేశ్ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన ముగ్గురు రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, ఆర్ కృష్ణయ్య, సానా సతీష్ ఇవాళ ఉదయం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యసభలో ఈరోజు ఉదయం వారితో చైర్మన్ జగదీప్ దన్‌ఖడ్ ప్రమాణ స్వీకారం చేయించారు. రాజ్యసభ ఉప ఎన్నిక ఇటీవల జరిగిన సంగతి విదితమే.

ఈ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ నుంచి బీద మస్తాన్ రావు, సానా సతీష్, బీజేపీ నుంచి ఆర్ కృష్ణయ్యలు బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో వీరు ముగ్గురు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది.

అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమిలోని పార్టీలు 164 స్థానాలను కైవసం చేసుకున్నాయి. దీంతో వీరి ఎన్నిక ఏకగ్రీవమైంది.

# మహిళ దారుణహత్య

అమరావతి, డిసెంబర్ 16:: ఆముదాల వలస మండలంలోని గాజుల కొల్లివలస ఆర్ ఆర్ కాలనీకి చెందిన దామోదర పద్మ (35) అనే మహిళను దారుణంగా హత్య చేసి దుండగుడు పరారయ్యాడు. ఇదే గ్రామానికి చెందిన సోండి సురేష్ కత్తితో మహిళ ఛాతీలో పొడిచి హత్య చేసినట్లుగా స్థానికులు చెబుతున్నారు. మృతురాలికి ఇద్దరు ఆడపిల్లలు. భర్త చనిపోయాడు.ఈ మహిళ హత్యకు కారణం వివాహేతర సంబంధమని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ కు తరలించారు. ఆమదాలవలస పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఆహార మార్పులతో అద్భుత జీవనం సాధ్యమే!

## - హైదరాబాద్‌లో ఘనంగా పాన్ ఇండియా 29వ సీఎంఇ
## - 29వ ఇన్-పర్సన్ కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ (అఒఇ)
## -ఆధునిక రిసెర్చ్‌లు ప్రజెంట్ చేసిన వైద్య నిపుణులు




హైదరాబాద్, డిసెంబర్ 16:ఫిజీషియన్స్ అసోసియేషన్ ఫర్ న్యూట్రిషన్ (PAN) ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాదులోని బంజారాహిల్స్ హయాత్ ప్లేస్‌లో 29వ ఇన్-పర్సన్ కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ (CME) కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం ఆహార పోషకాహార ప్రాధాన్యత, ముఖ్యంగా ప్లాంట్ బేస్డ్ డైయెట్స్ ద్వారా నాన్-కమ్యూనికబుల్ డిసీజెస్ (CME నిర్వహణపై చర్చించడానికి వైద్య నిపుణులు, పోషకాహార నిపుణులను ఒక వేదికపైకి తెచ్చింది.

ఈ సదస్సులో డాక్టర్ హేమలత, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రజీన షహీన్, డాక్టర్ ప్రత్యుష నెరెళ్ల వంటి వైద్య నిపుణులు ప్రజెంట్ చేసిన ఆధునిక రిసెర్చ్ ఫలితాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. డాక్టర్ రాజేందర్ రామగిరి ఆధ్వర్యంలో డయాబెటిస్ రిమిషన్‌పై కేస్ ప్రెజెంటేషన్, జీవన శైలిలో మార్పులతో వచ్చిన అద్భుత ఫలితాలను వివరించారు. ఎఃఅ, శోగ్రెన్ సిండ్రోమ్ నుండి రిమిషన్ సాధించిన మూడు రోగుల కేస్ స్టడీ, పోషకాహారం ద్వారా సాధించిన ఫలితాలను తెలిపారు.

డాక్టర్ సుందీప్ లక్టాకియా మోడరేట్ చేసిన ప్యానెల్ డిస్కషన్, వైద్య రంగంలో పోషకాహారం సమగ్రతపై చర్చించారు. డాక్టర్ హేమలత ప్రసంగంలో నిరోధక ఆరోగ్యం, వ్యాధి నిర్వహణలో పోషకాహారం ప్రాధాన్యతను హైలైట్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఒకరితో ఒకరు కొత్త ఆలోచనలను పంచుకున్నారు. పోషకాహారంపై దృష్టి సారించడం ద్వారా ఆరోగ్య సంరక్షణను మెరుగుపరచడంలో PAN ఇండియా తన కట్టుబాటును మరింత బలోపేతం చేసింది. ఈ CME ప్రోగ్రామ్ PAN ఇండియా లక్ష్యమైన ఆహార సంబంధిత వ్యాధులను నివారించి, పర్యావరణ అనుకూల ఆరోగ్య పరిష్కారాలను ప్రోత్సహించే దిశగా మరొక మైలురాయిగా నిలిచింది.

# కార్ సర్వీసింగ్ సెంటర్‌లో అగ్ని ప్రమాదం

హైదరాబాద్, డిసెంబర్ 16: ఓ కారు సర్వీసింగ్ సెంటర్‌లో ఆదివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకున్నది. వివరాలిలా ఉన్నాయి. అత్తాపూర్ హైదర్‌గూడలోని నెక్స్ జెన్ కార్ సర్వీసింగ్ సెంటర్‌లో నాలుగు కార్లకు మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో ఒక కారు పూర్తిగా దహనం కాగా, మరికొన్ని కార్లకు మంటలు ఉండగా స్థానికులు వెంటనే అప్రమత్తమై మంటలను ఆర్పివేశారు. ఆదివారం కావడంతో సర్వీసింగ్ సెంటర్ మూసి ఉన్నది. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఉత్పత్తులు సరసమైన ధరలకు అందించాలి

## -శిల్పారామంలో ఆలిండియా క్రాఫ్ట్ మేళా ప్రారంభించిన మంత్రి తుమ్మల



హైదరాబాద్, డిసెంబర్ 16:మాదాపూర్‌లోని శిల్పారామంలో మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, నేషనల్ జ్యూట్ బోర్డు, శిల్పారామాల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా క్రాఫ్ట్ మేళాను ఆదివారం హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈనెల 15 నుంచి 31వ తేదీ వరకు కొనసాగే ఈ మేళాలో దేశంలోని 20 రాష్ట్రాల నుంచి విచ్చేసిన చేనేత, హస్తకళాకారులు తమ ఉత్పత్తులను వినియోగదారులకు సరసమైన ధరలకు అందించనున్నారు. మేళాలో భాగంగా ప్రతిరోజు సాయంత్రం సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్ తంజావూరు ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసే కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకోనున్నారు. కార్యక్రమంలో శిల్పారామం ప్రత్యేక అధికారి కిషన్‌రావు, వీవర్స్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ అరుణ్‌కుమార్, శిల్పారామం జనరల్ మేనేజర్ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

# ఒకే దేశం, ఒకే ఎన్నిక.. నియంతృత్వానికి దారి

## -రాజ్యాంగాన్ని ధ్వంసం చేసే కుట్రలో బీజేపీ
## -సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు

హైదరాబాద్, డిసెంబర్ 16: కాంగ్రెస్ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడితే..రాజ్యాంగాన్ని బీజేపీ ధ్వంసం చేస్తున్నదని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు విమర్శించారు. ప్రపంచంలో ఎలక్టోరల్ డిక్టేటర్‌షిప్ అనే కొత్త సంస్కృతి తెరపైకి వచ్చిందని వివరించారు. ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. ఒకే దేశం-ఒకే ఎన్నిక కూడా నియంతృత్వానికి దారి తీస్తుందని చెప్పారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) సీనియర్ నాయకుడు అక్షయ్ కుమార్ దత్ ప్రథమ వర్ధంతి ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. భారతీయులు విశ్వ మానవులని, వారికి స్ఫూర్తి రాజ్యాంగమేనన్నారు.

అక్షయ్ కుమార్ దత్ విశ్వ మానవుడని కొనియాడారు. లౌకికవాది, మానవతావాది, సమతావాది, కులం, మతం, ప్రాంతం, రంగులకు అతీతంగా సమానత్వం కోరుకున్న వారు విశ్వ మానవులని చెప్పారు. దత్ అస్థిత్వం విశ్వ మానవ లక్షణం అన్నారు. భారతీయులందరికి సమానమైన హక్కులు ఉండాలని.. అమెరికా లాంటి పెట్టుబడిదారీ దేశాల్లో అమలవుతున్న పౌరసత్వ ప్రాతిపదిక జాతీయ వాదం (సిటిజన్ బేస్డ్ నేషనలిజం) మన దేశంలో అమలు కాకుండా అడ్డుకోవడానికి ముస్లింలను మినహాయించి పౌరసత్వ సవరణ చట్టం చేయబూనుకున్నారని ఆరోపించారు.

# కుంగిన రోడ్డు.. 20 అడుగుల లోతులో పెద్ద గొయ్యి



లక్నో, డిసెంబర్ 14:రోడ్డు మధ్యలో కుంగింది. దీంతో 20 అడుగుల లోతైన భారీ గొయ్యి ఏర్పడింది.

ఇది చూసి స్థానికులు భయాందోళన చెందారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆ రోడ్డును మూసివేశారు. దీంతో భారీగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ఈ సంఘటన జరిగింది. సోమవారం ఉదయం వికాస్ నగర్ మెయిన్ రోడ్‌లోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ ముందున్న రోడ్డు కుంగిపోయింది. దీంతో 20 అడుగుల లోతులో పెద్ద గొయ్యి ఏర్పడింది. ఇది చూసి స్థానికులు భయాందోళన చెందారు. అయితే ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగలేదు.

కాగా, ఈ విషయం తెలుసుకున్న పోలీసులు, మున్సిపల్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రోడ్డు కుంగడంతో ఏర్పడిన పెద్ద గోతిని పరిశీలించారు. ముందు జాగ్రత్త కోసం అక్కడ బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆ రోడ్డును మూసివేశారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మరోవైపు ఈ ప్రాంతంలో తరచుగా రోడ్లు కుంగి భారీగా గోతులు ఏర్పడుతున్నాయని స్థానికులు విమర్శించారు. అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు.

# కార్బన్ మోనాక్సైడ్ పీల్చి.. జార్జియా స్కీయింగ్ రిసార్టులో 12 మంది మృతి

న్యూఢిల్లీ, డిసెంబర్ 16:జార్జియా దేశంలోని స్కీయింగ్ రిసార్టులో విషాద ఘటన చోటుచేసుకున్నది. కార్బన్ మోనాక్సైడ్ విషపూరిత వాయువు పీల్చడం వల్ల 12 మంది మృతిచెందారు. వీరిలో 11 మంది విదేశీయులు, ఓ జార్జియా దేశస్తుడు ఉన్నారు. గుదౌరి ప్రాంతంలో ఉన్న ఓ రెస్టారెంట్ వద్ద ఘటన జరిగింది. నిద్రించే స్థలంలో మృతదేహాలను గుర్తించారు. మాజీ సోవియేట్ ప్రాంతమైన జార్జియాలో ఆ స్కీయింగ్ రిసార్టు ఉన్నది. విద్యుత్తు అంతరాయం ఏర్పడిన సమయంలో.. బిల్డింగ్‌లో ఉన్న ఆయిల్ పవర్ జనరేటర్‌ను స్టార్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఇండియన్ రెస్టారెంట్ ఉన్న బిల్డింగ్ రెండవ ఫ్లోర్‌లో మృతదేహాలను గుర్తించారు. ఈ ఘటన పట్ల దర్యాప్తు ప్రారంభించారు. అయితే మృతుల వివరాలను ఇంకా వెల్లడించలేదు.

# కోచింగ్ సెంటర్‌లో పొగలు.. స్పృహతప్పిన పలువురు విద్యార్థులు

జైపూర్, డిసెంబర్ 14: పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చే కోచింగ్ సెంటర్‌లో పొగలు వ్యాపించాయి. దీంతో ఊపిరాడక కొంత మంది విద్యార్థులు స్పృహతప్పి పడిపోయారు. వారిని వెంటనే హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. స్పందించిన అధికారులు ఆ కోచింగ్ సెంటర్‌కు సీల్ వేశారు. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో ఈ సంఘటన జరిగింది. ఆదివారం రాత్రి గోపాల్‌పూర్‌లోని ఉత్కర్ష్ కోచింగ్ సెంటర్‌లో పొగలు వ్యాపించాయి. ఆ ప్రాంగణంలోని తలుపులు, కిటికీలు మూసి ఉన్నాయి. దీంతో పొగలకు ఊపిరాడక సుమారు 12 మంది విద్యార్థులు స్పృహతప్పి పడిపోయారు. వారిని వెంటనే హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి సీరియస్‌గా ఉన్న ఇద్దరికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు.

కాగా, ఆ సమయంలో కోచింగ్ సెంటర్‌లో సుమారు 350 మంది విద్యార్థులున్నారు. ఈ సంఘటనపై విద్యార్థులు భయాందోళన చెందారు. వారంతా ఆ కోచింగ్ సెంటర్ నుంచి బయటకు పరుగులు తీశారు. రోడ్డుపై గుమిగూడారు. ఈ విషయం తెలిసిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. విష వాయువులుగా భావిస్తున్న పొగలు ఎక్కడి నుంచి వచ్చాయి అన్నదానిపై దర్యాప్తు చేస్తున్నారు. కోచింగ్ సెంటర్ పక్కనే ఉన్న ఇంట్లోని వంటగది నుంచి గ్యాస్ లీక్ కావడం లేదా సమీపంలోని డ్రైనేజీ నుంచి విష వాయువులు వెలువడి ఉంటాయని అనుమానిస్తున్నారు. మరోవైపు సోమవారం ఉదయం ఉత్కర్ష్ కోచింగ్ సెంటర్ వద్ద విద్యార్థులు, పేరెంట్స్ నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో ఆ కోచింగ్ సెంటర్ ఉన్న భవనాన్ని జైపూర్ మున్సిపల్ కార్పొరేషన్ అధికాకారులు సీజ్ చేశారు. సమీపంలోని పేయింగ్ గెస్ట్‌కు కూడా సీల్ వేశారు. విష వాయువుల వ్యాప్తిపై విచారణ పూర్తయ్యే వరకు ఈ రెండు భవనాలు సీజ్‌లో ఉంటాయని అధికారులు తెలిపారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.